# క్రైమ్ మిర్రర్ ®

Voice of Anti Corruption

హైదరాబాద్
8-10-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక:199

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## యాదాద్రి ప్లాంట్‌పై కొత్త రగడ!

హరీశ్‌కు భట్టి సవాల్.. రూ.40 వేల కోట్ల భారం ఎవరిది?.. అంటూ ప్రశ్న

బొగ్గు సరఫరా విషయంలో గత ప్రభుత్వ నిర్ణయాలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రశ్నలు

రూ.40 వేల కోట్ల భారం.. యాదాద్రి ప్లాంట్‌పై భట్టి సంచలన ప్రశ్న

సింగరేణిలో +9 గ్రేడ్ బొగ్గు లేనప్పుడు ప్లాంట్‌కు ఎలా సరఫరా చేస్తారన్న నిలదీత

రాష్ట్ర విద్యుత్ డిమాండ్ 19,892 మెగావాట్లకు చేరినా కోతలు లేవని వెల్లడి

జెన్‌కో, ట్రాన్స్‌కో ప్రైవేటీకరణకు ఎలాంటి ప్రతిపాదన లేదని స్పష్టీకరణ

# బిజెపికి దగ్గరగా బిఆర్ఎస్!

కాంగ్రెస్ అగ్రనాయకత్వం పై కేటీఆర్ ఫైర్

ఏకంగా రాహుల్ గాంధీ పై గురి

కమల దళానికి దగ్గరవుతున్న సంకేతాలు




దేశంలో కాంగ్రెస్ బలహీనం కావచ్చు. కానీ తెలంగాణలో మాత్రం బలమైన పక్షమే. అందుకే గులాబీ పార్టీకి హస్తం టార్గెట్. ఆపై జాతీయస్థాయిలో భారతీయ జనతా పార్టీకి కూడా ఆ పార్టీ బద్ధ శత్రువు. అయితే కమలదళం విషయంలో వేరే ఆలోచనతో ఉన్న గులాబీ పార్టీ అగ్రనేతలు.. హస్తం పార్టీ విషయంలో మాత్రం కఠినంగా ఉంటున్నారు. తాజాగా గులాబీ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ లక్ష్యంగా తీవ్ర విమర్శలు చేశారు.

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** చాలా అగౌరవంగా మాట్లాడారు. దేశానికి ప్రధానమంత్రి కావాలని కలలు కొంటున్న రాహుల్ గాంధీ చేష్టలు పిరికిపందలా ఉన్నాయని.. ఇతరులకు భయభ్రాంతులకు గురి చేసేలా.. ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ఉన్నాయంటూ తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు కేటీఆర్. దేశవ్యాప్తంగా

- మిగతా 3వ పేజీలో



2లో

## ఢిల్లీలో ఇండియా కూటమి నిరసన ఉద్రిక్తత..

అదుపులోకి రాహుల్ గాంధీ, ప్రియాంక.. నేలపై పడుకొని ప్రియాంక ఆందోళన

ఢిల్లీలో జంతర్ మంతర్‌కు బయలుదేరిన ప్రతిపక్ష ఎంపీలను అడ్డుకున్న పోలీసులు

రోడ్డుపైనే బైఠాయించిన రాహుల్, ప్రియాంక సహా పలువురు నేతలు

సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్

రోడ్డుపై పడుకుని నిరసన తెలిపిన ప్రియాంక గాంధీ

## కవిత కొత్త ప్రయోగం!

### సామాన్యులే టార్గెట్ గా రాజకీయం

సెంటిమెంట్ కాకుండా ప్రజల మద్దతు కోసం ఆరాటం

ప్రజా రాజకీయాలతో ముందడుగు వేసేందుకు ప్రయత్నం

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో పొలిటికల్ సీన్ మారింది. ఇప్పటివరకు ప్రత్యేక రాష్ట్ర సెంటిమెంట్ నడిచింది. తెలంగాణ రాజకీయ అవకాశాలతో పాటు ఇతరత్రా అంశాలను హైలెట్ చేస్తూ రాజకీయ పార్టీలు రాజకీయ లబ్ధి పొందాయి. అయితే వీటికి కాలం చెల్లిపోయింది. కేవలం సెంటిమెంట్ పై ఆధారపడకుండా



2లో

# ప్రపంచ విపత్తు!




కరోనా లాంటి మరో ఆరోగ్య సంక్షోభం సిద్ధం

రష్యా నుంచి సంకేతాలు

గోప్యంగా ఉంచుతున్న అక్కడి ప్రభుత్వం

ప్రపంచవ్యాప్తంగా ఆందోళన

**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్**

కరోనా.. ఈ పేరు చెబితేనే ప్రపంచవ్యాప్తంగా ప్రజలు గడగడలాడారు. వైరస్ కు ప్రపంచవ్యాప్తంగా లక్షలాదిమంది బాధితులుగా మారారు. వేలాది మంది ప్రాణాలు వదిలారు. అయితే అటువంటి వైరస్ మరొకటి ప్రపంచానికి ఎదురయ్యే అవకాశం ఉంది.

ఇది నిజంగా ఆందోళన కలిగించే విషయం. రష్యాలోని సైబీరియాలో వెలుగు చూసిన ఘటన ప్రపంచానికి పరుగులెట్టిస్తోంది. ఓ యాంటీ ప్లేగు రీసెర్చ్ ఇన్స్టిట్యూట్లో ల్యాబ్ టెక్నీషియన్ గా

## ఈశాన్య ఢిల్లీలో కుప్పకూలిన 5 అంతస్థుల భవనం

3లో

ఇళ్ల నుంచి రోడ్లపైకి పరుగులు తీసిన ప్రజలు

శిథిలాల తొలగింపు చర్యలను వేగవంతం

శిథిలాల నుంచి నలుగురిని కాపాడిన స్థానికులు

2లో

## అమెరికాలో 40 మంది పౌరసత్వం రద్దు..

జాబితాలో పలువురు భారతీయులు!

3లో

## పెట్టుబడులను ఆకర్షించేందుకు చర్యలు

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

సమన్వయంతో సమర్థవంతంగా చేపట్టాలి

ఇన్వెస్ట్ తెలంగాణ తొలి గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం

## దసరా పండుగకు ౭ వేల ప్రత్యేక బస్సులు..

తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ కీలక నిర్ణయం!

ప్రత్యేక బస్సుల ఛార్జీలలో మార్పు

హైదారాబాద్, అక్టోబర్ ): దసరా పండుగ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే





## యువత నైపుణ్యమే తెలంగాణకు బలం

ప్రపంచ సంస్థలకు హైదరాబాద్ గమ్యస్థానం

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

2లో

## యాసంగిలో వరి బదులు ఆరుతడి పంటలే మేలు

భూగర్భ జలాలను బట్టే పంట ఎంపిక

వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ సూచన

వ్యవసాయ అనుబంధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష

విత్తనాలు, ఎరువుల సరఫరాపై పలు సూచనలు

## రెపో రేటు 5.50 శాతానికి పెంపు

- 25 బేసిస్ పాయింట్లు పెంచిన ఆర్‌బీఐ
- ఆగస్టులో ద్రవ్యోల్బణం 4.82 శాతానికి చేరిక
- ద్రవ్య విధాన కమిటీ సమావేశంలో నిర్ణయం
- ద్రవ్యోల్బణం భారీగా పెరిగే అవకాశం!!
- 'జంబో హైక్' వైపు మొగ్గు చూపవచ్చు
- ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడి
- ఒకేసారి కఠిన చర్యలు తీసుకోవడం తప్పదు
- ఎస్‌బీఐ అడ్వైజర్ డాక్టర్ సౌమ్య కాంతి ఘోష్

**న్యూఢిల్లీ , (క్రైమ్ మిర్రర్):** ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక పరిస్థితులు సవాళ్లుగా మారుతున్న వేళ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా



2లో

# కవిత కొత్త ప్రయోగం!

ప్రజా రాజకీయాలు చేస్తేనే గుర్తింపు అని 2023 ఎన్నికలతో తేలిపోయింది. అందుకే ఇప్పుడు అన్ని రాజకీయ పార్టీలు ప్రజా రాజకీయాలతో ముందుకు వెళ్లాలని నిర్ణయించుకున్నాయి. తెలంగాణ సమాజంలో ఏ పార్టీ కూడా అతీతం కాదు. తాజాగా కవిత నేతృత్వంలోనే తెలంగాణ రక్షణ సేన కూడా ఇదే ఫార్ములాను అనుసరిస్తోంది. ప్రజల మధ్య ఉంటూ ప్రజా రాజకీయం చేయాలని భావిస్తోంది. కేవలం తన తండ్రి పార్టీ, ఒకప్పటి టిఆర్ఎస్ మాదిరిగా ప్రత్యేక రాష్ట్రం, తెలంగాణ పేరు చెప్పుకుంటే వర్కౌట్ కాదని గుర్తించిన కవిత కొత్త రాజకీయం దిశగా అడుగులు వేస్తున్నారు.

**ప్రజా సమస్యల ప్రస్తావన..**

ఇటీవల కవిత రాజకీయం చూస్తే ఇట్టే అర్థం అవుతుంది. ఆమె కింది స్థాయిలో ప్రజా సమస్యలను గుర్తించి వాటిపై స్పందిస్తున్నారు. తాజాగా ఆదాయం కోసం ఓలా, రాపిడో, బ్లింకిట్, స్విగ్గి వంటి సంస్థల్లో బైక్, టాక్సీలు నడుపుకుంటూ జీవనం చేస్తున్న నిరుద్యోగ యువత, విద్యార్థుల కష్టాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు కవిత. ఇంతవరకు ఏ రాజకీయ పార్టీ కూడా వారి సమస్యలను గుర్తించలేదు. అటువంటిది కవిత వారి పక్షాన గళం విప్పడం విశేషం. బైక్ టాక్సీ లకు పసుపు రంగు నంబర్ ప్లేట్లు తప్పనిసరి చెయ్యాలనే ప్రభుత్వం ఆలోచన.. సామాన్య గిగ్ వర్కర్ల ఉపాధిని గండి కొడుతుందని ఆమె తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తద్వారా కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా.. నిత్యజీవితంలో ప్రజలు ఎదుర్కొనే ప్రతి చిన్న సమస్యను లోతుగా పరిశీలిస్తూ... వారికి అండగా నిలవడం ఆమె రాజకీయ ప్రత్యేకత గా నిలుస్తుంది.

**వారిది విలక్షణ పాత్ర..**

తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులతో పాటు నిరుద్యోగులది ప్రత్యేక స్థానం. దానిని మరిచి రాజకీయం చేసింది భారత రాష్ట్ర సమితి. అది తెలంగాణ సమాజంలో ఎంతో నష్టం చేసింది ఆ పార్టీకి. దానిని గుర్తించి రాజకీయం చేస్తున్నారు కవిత. సాధారణ వైట్ ప్లేట్ వాహనాన్ని కమర్షియల్ పసుపు ప్లేట్గా మార్చాలంటే.. కచ్చితంగా మోటార్ వెహికల్ చట్టాల ప్రకారం కమర్షియల్ ఇన్సూరెన్స్, పర్మిట్లు, ఫిట్నెస్ సర్టిఫికెట్లు తప్పనిసరి. అయితే రోజువారి సంపాదనపై ఆధారపడే పార్ట్ టైం రైడర్లకు ఇది తలకు మించిన భారం. పసుపు నెంబర్ ప్లేట్లు ఉంటే ఆ బండిని వ్యక్తిగత అవసరాలకు మాత్రమే వాడుకోవాలి. ఈ నిబంధనను తెరపైకి తెచ్చి వాహనదారులపై నియంత్రణకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్న ఆరోపణ కవిత తెరపైకి తెచ్చి ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. తద్వారా సాధారణ ప్రజల అభిమానాన్ని చురగొనే ప్రయత్నం చేస్తున్నారు. మరి ఇది ఎంతవరకు వర్క్ అవుట్ అవుతుందో చూడాలి.

# ప్రపంచ విపత్తు!

(మొదటి పేజీ తరువాయి)

పనిచేస్తున్న 28 సంవత్సరాల దరియా షిప్పిలోవా అనే మహిళ అనుమానాస్పద మృతి ప్రపంచాన్నే కలవరపరుస్తోంది. ఆమె పనిచేస్తున్న సమయంలో టెస్ట్ ట్యూబ్ పగిలి ప్రాణాంతకమైన బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశించింది. తీవ్రమైన నిమోనియాతో ఆమె మృతి చెందడం కలకలం రేపింది.

**అంతటా ఆందోళనకరం..**

రష్యాలో వెలుగు చూసిన ఈ ఘటన సర్వసాధారణం అయినదని ఎవరూ భావించడం లేదా. ఇది సాధారణ ల్యాబ్ సంఘటన కాదు అన్న అనుమానాలు పెరుగుతున్నాయి. అక్కడి నుంచి ప్రాణాంతకమైన ప్లేగు వైరస్ లేదా బ్యాక్టీరియా లీక్ అయిందన్న అనుమానాలు బలంగా వినిపిస్తున్నాయి. మృతురాలితో సన్నిహితంగా మెలిగిన వారు, ఆసుపత్రిలో చికిత్స అందించిన దాదాపు 200 మందికి అత్యవసరంగా వైద్యుల పర్యవేక్షణలో ఉంచి.. క్వారంటైన్ చేయడం అనుమానాలను మరింతగా పెంచింది. ఇది గాలి ద్వారా అత్యంత వేగంగా వ్యాపించే న్యూమోనిక్ ప్లేగు కావచ్చని.. రష్యన్ ఆరోగ్య అధికారులు దీనిని బయట పెట్టకుండా గోప్యంగా ఉంచుతున్నారని అనుమానాలు, విమర్శలు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆరోగ్య వర్గాల్లో వ్యాప్తి చెందుతున్నాయి.

**కళ్ళముందే కరోనా విపత్తు..**

కరోనా విసిరిన విపత్తు గురించి ఇప్పటికీ




ప్రపంచవ్యాప్తంగా ప్రజలు గుర్తించుకునే ఉన్నారు. ఇప్పుడు కొత్తగా ఈ వైరస్ ద్వారా జరిగే విపత్తు గురించి ఆందోళన చెందుతున్నారు. అధికారిక వర్గాల నుంచి ఎలాంటి స్పష్టమైన నిర్ధారణ జరగలేదు. కానీ అంతర్జాతీయ వైద్య నిపుణులు, గ్లోబల్ హెచ్ఐవి, వైరాలజీ నిపుణులు దీనిని అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నారు. కోవిడ్ 19 మహమ్మారికి ముందు చైనాలో ఓ ల్యాబ్ లో గురించి వార్తలు హల్చల్ చేశాయి. ఇప్పుడు తాజాగా ఈ ఘటన కూడా అటువంటి పరిస్థితిని గుర్తు చేస్తోంది. ప్లేగు వంటి భయంకరమైన వ్యాధి కారకాలు మళ్ళీ మానవాళిపై దాడి చేస్తే పరిస్థితి ఎలా ఉంటుందన్న ఆందోళన ప్రపంచవ్యాప్తంగా ఉంది. అయితే చాలా కాలం కిందటే ప్లేగు లాంటి భయంకరమైన జయించామని ప్రపంచం చెప్పుకుంటుంది. కానీ తాజాగా పెను విపత్తు ప్రపంచాన్ని గడగడ లాడిస్తోంది.

## అమెరికాలో 40 మంది పౌరసత్వం రద్దు..

**న్యూఢిల్లీ , (క్రైమ్ మిర్రర్):** అమెరికా ప్రభుత్వం పౌరసత్వం విషయంలో కీలక చర్యలు చేపట్టింది. తప్పుడు వివరాలు ఇచ్చి లేదా తమ గతాన్ని దాచిపెట్టి అమెరికా పౌరసత్వం పొందినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 40 మందిపై పౌరసత్వం రద్దు చేసేందుకు న్యాయపరమైన ప్రక్రియను ప్రారంభించింది. వీరిలో భారతీయుడు కూడా ఉన్నారు. అమెరికా ఆధునిక చరిత్రలో ఇదే అతిపెద్ద 'డీ-న్యాచురలైజేషన్' చర్యగా న్యాయశాఖ పేర్కొంది. అమెరికా పౌరసత్వాన్ని మోసం, చట్టవిరుద్ధ మార్గాల ద్వారా పొందిన వారిపై చర్యలు తీసుకునే విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని దీంతో స్పష్టమవుతోంది. ఆగస్టు 21 నుంచి అక్టోబర్ 2 మధ్య దేశంలోని 19 ఫెడరల్ డిస్ట్రిక్ట్ కోర్టుల్లో ఈ 40 మందిపై సివిల్ కేసులు దాఖలయ్యాయి. వీరిలో కొందరు తీవ్రమైన నేరాలకు పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయి. మరికొందరు పౌరసత్వం కోసం దరఖాస్తు చేసిన సమయంలో తమకు సంబంధించిన ముఖ్యమైన వివరాలను దాచిపెట్టారని, తప్పుడు సమాచారం ఇచ్చారని అధికారులు చెబుతున్నారు. గూఢచర్యం నుంచి లైంగిక నేరాల వరకు వివిధ తీవ్రమైన కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న కొందరు తమ గతాన్ని దాచిపెట్టి పౌరసత్వం పొందారని అమెరికా అటార్నీ జనరల్ టాడ్ బ్లాంచ్ తెలిపారు. పౌరసత్వం పొందే ప్రక్రియలో మోసాలను సహించబోమని స్పష్టం చేశారు.

# రెపో రేటు 5.50 శాతానికి పెంపు

(మొదటి పేజీ తరువాయి)

సవాళ్లుగా మారుతున్న వేళ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచింది. దీంతో రెపో రేటు 5.50 శాతానికి చేరింది. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో మూడు రోజుల పాటు జరిగిన ద్రవ్య విధాన కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రెపో రేటుతో పాటు స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ రేటు 5.25 శాతానికి, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ, బ్యాంక్ రేటు 5.75 శాతానికి చేరాయి.ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం భారీగా పెరిగే అవకాశం ఉందని మల్హోత్రా తెలిపారు. దీంతో పలు ప్రధాన దేశాల కేంద్ర బ్యాంకులు ద్రవ్య విధానాన్ని కఠినతరం చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. భారత్‌లోనూ ద్రవ్యోల్బణం పెరుగుతోంది. ఆగస్టులో వినియోగదారుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 4.82 శాతానికి చేరింది. జులైలో ఇది 4.45 శాతంగా ఉంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లను దాటాయి. అంతర్జాతీయంగా బాండ్ ఈల్డ్స్ పెరగడం, క్రూడ్ ధరలు ఎగబాకడం, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు పెరగడంతో రెపో రేటును యథాతథంగా ఉంచే అవకాశం తగ్గిందని ఆర్థిక నిపుణులు తెలిపారు. ఫిబ్రవరి 2023 తర్వాత తొలిసారి రెపో రేటు పెరగొచ్చని నిపుణులు ముందుగానే అంచనా వేశారు. ద్రవ్యోల్బణం దాదాపు 5 శాతానికి చేరుతున్న నేపథ్యంలో రానున్న సమావేశాల్లోనూ కఠిన నిర్ణయాలు ఉండొచ్చని ఎస్‌బీఐ రీసెర్చ్ పేర్కొంది. ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, మార్కెట్లలో మారుతున్న రిస్క్‌ల నేపథ్యంలో ముందస్తు చర్య తీసుకోవడం మంచిదని ఎస్‌బీఐ రీసెర్చ్ ఆర్థిక నిపుణులు అభిప్రాయపడ్డారు. ఎల్‌నినో ప్రభావం, అక్టోబర్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం కూడా రబీ పంటలపై ప్రభావం చూపే అవకాశం ఉందని వారు తెలిపారు. మరోవైపు రాబోయే డిసెంబర్ ద్రవ్య పరపతి సమీక్షలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రెపో రేటును ఏకంగా 50 బేసిస్ పాయింట్లు (0.50 శాతం) పెంచే అవకాశం ఉందని ఎస్‌బీఐ రీసెర్చ్ తన తాజా నివేదికలో అంచనా వేసింది. దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, అనిశ్చితంగా ఉన్న అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఆర్‌బీఐ ఈ 'జంబో హైక్' వైపు మొగ్గు చూపవచ్చని బుధవారం విడుదల చేసిన ఈ నివేదిక పేర్కొంది. వడ్డీ రేట్లను విడతలవారీగా స్వల్పంగా పెంచడం కంటే, ఒకేసారి కఠిన చర్యలు తీసుకోవడమే సమంజసమని ఎస్‌బీఐ గ్రూప్ చీఫ్ ఎకనమిక్ అడ్వైజర్ డాక్టర్ సౌమ్య కాంతి ఘోష్ అభిప్రాయపడ్డారు. డిసెంబర్ నాటికి రెపో రేటును 6 శాతానికి చేర్చడమే సరైన మార్గమని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన ఆర్‌బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీసీ) సమావేశంలో రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి, 5.50 శాతానికి చేర్చిన సంగతి విదితమే. ఆర్‌బీఐ తన వైఖరిని మార్చుకుందని ఎస్‌బీఐ రీసెర్చ్ విశ్లేషించింది. గతంలో పరిస్థితులను కేవలం పరిశీలిస్తున్నట్లు పేర్కొన్న ఆర్‌బీఐ, అక్టోబర్ పాలసీలో మాత్రం ద్రవ్యోల్బణం కట్టడిపై తన కఠిన వైఖరిని స్పష్టంగా ప్రదర్శించిందని తెలిపింది. వృద్ధి, ద్రవ్యోల్బణం అంచనాలను కూడా ఆర్‌బీఐ సవరించింది. 2027 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాను 7.1 శాతానికి, సీపీఐ ద్రవ్యోల్బణం అంచనాను 5.20 శాతానికి పెంచింది. కాగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో జీడీపీ వృద్ధి 7.5 శాతానికి చేరవచ్చని ఎస్‌బీఐ అంచనా వేస్తోంది. చారిత్రక పరిణామాలను పరిశీలిస్తే, ద్రవ్యోల్బణం తీవ్రతకు అనుగుణంగానే ఆర్‌బీఐ రెపో రేటు పెంపు ఉంటుందని నివేదిక గుర్తుచేసింది. ప్రస్తుత అంచనాల ప్రకారం, 2026 నవంబర్ నాటికి ద్రవ్యోల్బణం 6.8 శాతానికి చేరితే, రెపో రేటును 6 శాతం వరకు పెంచే అవకాశం ఉందని నివేదిక వెల్లడించింది.

## యాదాద్రి ప్లాంట్‌పై కొత్త రగడ!

హైదరాబాద్, అక్టోబర్ 7: యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ చుట్టూ రాజకీయ వేడి మళ్లీ పెరిగింది. ప్లాంట్‌కు అవసరమైన బొగ్గు విషయంలో గత ప్రభుత్వ నిర్ణయాలపై ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రశ్నలు సంధించారు. బొగ్గు లభ్యతపై స్పష్టమైన ఏర్పాట్లు లేకుండానే విద్యుత్ కేంద్రాన్ని చేపట్టడం వల్ల రాష్ట్రంపై భారీ ఆర్థిక ప్రభావం పడుతోందని ఆయన ఆరోపించారు. యాదాద్రి ప్లాంట్‌కు అవసరమైన +9 రకం బొగ్గు సింగరేణిలో అందుబాటులో లేదని భట్టి పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణి నుంచి బొగ్గు అందిస్తామని హామీ ఇచ్చి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లిందని, అయితే ఆ సరఫరా విషయంలో చేసుకున్న ఒప్పందాలు పూర్తిస్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. 2016లో సింగరేణి నుంచి 7 మిలియన్ టన్నులు, మిగిలిన 7 మిలియన్ టన్నులను దిగుమతి చేసుకునే ప్రతిపాదన ఉండగా.. తర్వాత మొత్తం 14 మిలియన్ టన్నులకూ సింగరేణినే ఆధారంగా చేసుకునే ఒప్పందం వచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి హరీశ్‌రావును ఉద్దేశించి భట్టి ప్రశ్నలు సంధించారు. సింగరేణిలో అవసరమైన గ్రేడ్ బొగ్గు అందుబాటులో లేని పరిస్థితిలో ప్లాంట్‌కు ఇంధన వనరులను ఎలా సమకూర్చాలనే దానిపై అప్పట్లో ఎందుకు ముందస్తు ప్రణాళిక చేయలేదని ప్రశ్నించారు. యాదాద్రి ప్రాజెక్టు కారణంగా బొగ్గు రవాణా తదితర అంశాల్లో రాష్ట్రంపై సుమారు రూ.40 వేల కోట్ల అదనపు భారం పడుతోందని ప్రభుత్వం గతంలోనూ వెల్లడించింది. ఇదే సమయంలో రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయికి చేరిందని భట్టి తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో పీక్ డిమాండ్ 19,892 మెగావాట్లకు పెరిగినా సరఫరాలో అంతరాయం లేకుండా వ్యవస్థను నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యుత్ శాఖకు చెందిన జెన్‌కో, ట్రాన్స్‌కో, డిస్కమ్ సిబ్బంది పనితీరును ఆయన అభినందించారు. విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి లేదని భట్టి స్పష్టం చేశారు. జెన్‌కో, ట్రాన్స్‌కోతో పాటు డిస్కమ్‌లను ప్రైవేటు చేతుల్లోకి ఇచ్చే ప్రతిపాదన లేదని తెలిపారు. విద్యుత్ రంగంపై ప్రతిపక్షాల నుంచి వస్తున్న విమర్శలకు రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

## దసరా పండుగకు 7 వేల ప్రత్యేక బస్సులు..

వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఎస్ఆర్టీసీ) పూర్తి స్థాయిలో సన్నద్ధమైంది. ఈ పండుగకు 7 వేల ప్రత్యేక బస్సులను నడపాలని యాజమాన్యం నిర్ణయించింది.ఇందులో భాగంగా కరీంనగర్ జోన్ నుంచి మొత్తం 3533 బస్సులు నడుపుతోంది. రీజియన్ల వారిగా ఆదిలాబాద్ 431, నిజామాబాద్ 719, కరీంనగర్ 1175, వరంగల్ 530, ఖమ్మం 678, హైదరాబాద్ జోన్ నుంచి 2155 బస్సులు నడుపుతుండగా రీజియన్ల వారిగా మహబూబ్ నగర్ 645, మెదక్ 255 , నల్గొండ 815, రంగారెడ్డి 440. అలాగే గ్రేటర్ హైదరాబాద్ జోన్ నుంచి 1312 దసరా పండగ కు ప్రత్యేక సర్వీసు లను నడపాలని టీజీఎస్ ఆర్టీసీ నిర్ణయించింది. ప్రధానంగా ఈ నెల 9,10,16, 17 తేదీల్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఆయా రోజుల్లో రద్దీ మేరకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచేలా టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం ప్లాన్ చేసింది. అలాగే, ఈ నెల 25, 26 తేదీల్లో తిరుగు ప్రయాణ రద్దీకి సంబంధించి తగిన ఏర్పాట్లు చేసింది. హైదరాబాద్ లో రద్దీ ప్రాంతాలైన ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ (నల్ల చెరువు) , ఆరాంఘర్, ఎల్బీనగర్ క్రాస్ రోడ్స్, కేపీహెచ్బీ, బోయిన్పల్లి, గచ్చిబౌలి తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను సంస్థ నడుపుతోంది. ఆయా ప్రాంతాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం పండల్స్, షామియానాలు, కుర్చీలు, పబ్లిక్ అడ్రస్ సిస్టం, తాగునీటి సదుపాయం, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేయనుంది. ప్రధాన పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు తలెత్తకుండా వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు స్పెషల్ సర్వీసులను ఆర్టీసీ

## యాసంగిలో వరి బదులు ఆరుతడి పంటలే మేలు

హైదారాబాద్: ఎల్‌నినో ప్రభావం వల్ల ఈసారి వర్షాలు, ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు ఉండే అవకాశం ఉన్నందున, రానున్న యాసంగిలో రైతులు వరికి బదులు తక్కువ నీటితో పండే పంటల వైపు మళ్లేలా చూడాలని వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి కె. సురేంద్ర మోహన్, ఐ.ఏ.ఎస్. జిల్లా వ్యవసాయ అధికారులను ఆదేశించారు. రబీ 2026-27 కార్యాచరణ ప్రణాళికపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నీటి లభ్యత తక్కువగా ఉండే పరిస్థితుల్లో వరి సాగు రైతులకు నష్టం కలిగించే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల స్వల్పకాలిక పప్పుధాన్యాలు, నూనెగింజల పంటలతో పాటు మంచి ఆదాయాన్నిచ్చే కూరగాయల సాగును ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి రైతూ తన ప్రాంతంలోని భూగర్భ జలాల లభ్యతను చూసుకున్న తరువాతే పంటను ఎంచుకునేలా క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) శాస్త్రవేత్త ఈ యాసంగిలో ఎల్‌నినో వల్ల వాతావరణంలో చోటుచేసుకునే మార్పులు, వర్షపాత స్థితి, ఉష్ణోగ్రతల అంచనాలను అధికారులకు వివరించారు. కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధనా సంస్థ (క్రిడా) శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో తీసుకోవలసిన చర్యలను వివరిస్తూ, భూగర్భ జలాల లభ్యత ఆధారంగానే పంటల ఎంపిక, సాగు జరగాలని స్పష్టం చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ, ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, భూగర్భ జలమట్టాలను దృష్టిలో ఉంచుకుని వరికి బదులు ఆరుతడి పంటలను ఎంచుకోవాలని సూచించారు. పప్పుధాన్య, నూనెగింజల, కూరగాయల పంటలకు అనువైన విత్తన కాలాలను కూడా వివరించారు. వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తలు ఈ సీజన్‌లో రైతులు సాగు చేయడానికి అనువైన పంట రకాలను సిఫార్సు చేశారు. యాసంగి సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో, సరిపడా అందుబాటులో ఉండేలా సరఫరా పరిస్థితిని కూడా కమిషనర్ సమీక్షించారు. రాష్ట్రంలో 2025-26లో 26 జిల్లాల్లో నత్రజని,భాస్వరం ఎరువుల వినియోగ నిష్పత్తులు జాతీయ సగటు (9.7 : 3.7 : 1) కంటే అధికంగా నమోదయ్యాయి.

## ఢిల్లీలో ఇండియా కూటమి నిరసన ఉద్రిక్తత..



న్యూఢిల్లీ, అక్టోబర్ 7: ఢిల్లీలో రాజకీయ ఆందోళన ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణాన్ని సృష్టించింది. ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ జంతర్ మంతర్ వైపు పయనించిన ఇండియా కూటమి ఎంపీలను పోలీసులు మార్గమధ్యంలోనే నిలిపివేయడంతో పరిస్థితి అదుపు తప్పింది. బస్సుల నుంచి దిగిన నేతలు రహదారిపైనే ఆందోళనకు దిగడంతో అక్కడ కొద్దిసేపు తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఏర్పాటు చేసిన సమావేశం ముగిసిన తర్వాత ప్రతిపక్ష ఎంపీలు బస్సుల్లో జంతర్ మంతర్‌కు బయలుదేరారు. అయితే గమ్యస్థానానికి చేరకముందే అశోకా రోడ్డు సమీపంలో పోలీసులు వాహనాలను అడ్డుకున్నారు. దీంతో ఎంపీలు అక్కడే కూర్చుని కేంద్ర ప్రభుత్వానికి, ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సమయంలో ప్రియాంక గాంధీ వాద్రా సహా కొందరు మహిళా నేతలు రహదారిపై పడుకుని తమ నిరసనను కొనసాగించారు. పోలీసులు వారిని అక్కడి నుంచి తరలించే ప్రయత్నం చేయడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తమైంది. తనను అదుపులోకి తీసుకునే సమయంలో మహిళా పోలీసులు కిందకు నెట్టడంతో తనకు గాయాలయ్యాయని ప్రియాంక ఆరోపించారు. మరోవైపు రాహుల్ గాంధీని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొందరు కాంగ్రెస్ ఎంపీలు బస్సుల పైభాగానికి చేరుకుని జాతీయ జెండాలు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. నిరసనలో కాంగ్రెస్‌తో పాటు టీఎంసీ, సీపీఎం, సీపీఐ, ఆర్జేడీ, ఐయూఎంఎల్‌కు చెందిన ఎంపీలు పాల్గొన్నారు. ఎన్నికల సంఘం కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను నిలిపివేయాలని ప్రతిపక్ష కూటమి డిమాండ్ చేస్తోంది. అయితే ఈ ఆందోళనకు సమాజ్‌వాదీ పార్టీ ఎంపీలు దూరంగా ఉండటం రాజకీయంగా చర్చనీయాంశమైంది. రాహుల్ గాంధీని రెండు రోజుల వ్యవధిలో పోలీసులు అదుపులోకి తీసుకోవడం ఇది మూడోసారి కావడం కూడా ఈ ఘటనలో మరో కీలక అంశంగా మారింది.

## యువత నైపుణ్యమే తెలంగాణకు బలం

హైదారాబాద్, అక్టోబర్ 07(ఆర్ఎన్ఏ): తెలంగాణకు ఉన్న అతిపెద్ద బలం యువతలోని నైపుణ్యం, ప్రతిభ, ప్రపంచ స్థాయి పోటీతత్వమేనని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఈ ప్రతిభ కారణంగానే హైదరాబాద్ సాంకేతిక, ఆవిష్కరణ, ఆర్థిక సేవలు, గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు (జీసీసీ) దేశంలోనే ప్రముఖ గమ్యస్థానంగా ఎదుగుతోందని వెల్లడించారు. జూబ్లీహిల్స్‌లో బుధవారం నాడు జరిగిన డిఇ షా షా ఇండియా 30వ వార్షికోత్సవ వేడుకల్లో మంత్రి శ్రీధర్‌బాబు పాల్గొని ప్రసంగించారు. హైదరాబాద్‌లో డీఈ షా మూడు దశాబ్దాల ప్రస్థానం నగరంపై, తెలంగాణలోని ప్రతిభావంతులైన మానవ వనరులపై ఆ సంస్థకు ఉన్న దీర్ఘకాలిక విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా డిఇ షా గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్లు ఎడ్డీ ఫిష్మన్, అనూప్ ప్రసాద్, నీల్ కాట్జ్‌కు మంత్రి అభినందనలు తెలిపారు. సంస్థ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్లు చైతన్య గొర్రెపాటి, లక్ష్మీ ప్రసాద్ కోనేటితో పాటు సంస్థలోని మొత్తం బృందానికి శుభాకాంక్షలు చెప్పారు. హైదరాబాద్ సామర్థ్యాన్ని తొలినాళ్లలోనే గుర్తించిన ప్రపంచస్థాయి ఆర్థిక, సాంకేతిక సంస్థల్లో డిఇ షా ఒకటని శ్రీధర్‌బాబు అన్నారు. 1996లో హైదరాబాద్‌లో తొలి భారత కార్యాలయాన్ని ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. "సుమారు 20 మందితో ప్రారంభమైన డిఇ షా ఇండియా ప్రస్థానం ఇవ్వాళ హైదరాబాద్, బెంగళూరు, గురుగ్రామ్‌లలో 2,000 మందికి పైగా ఉద్యోగులతో విస్తరించింది.

# బిజెపికి దగ్గరగా బిఆర్ఎస్!

(మొదటి పేజీ తరువాయి)

రాజ్యాంగ ప్రతిని చేతబట్టుకొని తిరుగుతున్న రాహుల్.. తెలంగాణలో మాత్రం తన కీలుబొమ్మ సీఎం రేవంత్ రెడ్డి ద్వారా అరాచక పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతున్నారంటూ ధ్వజమెత్తారు.

**స్పష్టంగా చెప్పిన కేటీఆర్..**

మొన్ననే ఢిల్లీలో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. బిజెపితో ఎట్టి పరిస్థితుల్లో పొత్తు ఉండదు అని తేల్చి చెప్పారు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడి బిజెపికి అనుకూల సంకేతాలు ఇచ్చారు కేటీఆర్. ముఖ్యంగా ఎలక్షన్ కమిషన్, సర్ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ గట్టిగానే ఆందోళన చేస్తోంది. జాతీయస్థాయిలో బిజెపి వ్యతిరేక పార్టీలు పెద్ద ఎత్తున భాగస్వామ్యం అవుతున్నాయి. సరిగ్గా ఇటువంటి సమయంలోనే బిజెపికి అనుకూలంగా.. కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా సంకేతాలు ఇచ్చారు కేటీఆర్. వీధుల్లోకి వచ్చి ఓటు చోరీ అంటూ నినాదాలు చేస్తున్న రాహుల్ గాంధీ.. తెలంగాణ రాజకీయాల్లో అతిపెద్ద ఓటు దొంగగా, ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిన



రేవంత్ రెడ్డిని తీసుకొచ్చి ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టారంటూ సంచలన ఆరోపణలు చేశారు. ఎన్నికలవేళ నీతులు చెప్పే కాంగ్రెస్ పార్టీ.. తెలంగాణలో మాత్రం రాజ్యాంగ విలువలకు తిలోదకాలు ఇచ్చిందంటూ ఆరోపణలు చేశారు.

**కాంగ్రెస్ అగ్ర నాయకత్వం పై విసుర్లు..**

దేశంలో ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదు అంటూ కేటీఆర్ చేసిన ఆరోపణ.. బిజెపికి దగ్గరయ్యేందుకు చేస్తున్న ప్రయత్నం గా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గత కొంతకాలంగా గులాబీ పార్టీ కమలదళంతో దోస్తీ చేస్తుందన్న అనుమానాలు ఉన్నాయి. ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తున్నట్లు కేటీఆర్ తాజాగా కాంగ్రెస్ అగ్రనాయకత్వం పై విరుచుకుపడ్డారు. అయితే కేటీఆర్ మాటల్లో కాంగ్రెస్ పార్టీ కంటే రేవంత్ రెడ్డి పై ఉన్న ద్వేషం బయటపడుతోంది. రేవంత్ కు రాహుల్ గాంధీ ప్రోత్సహిస్తున్నారన్న ఆగ్రహం కేటీఆర్ మాటల్లో ధ్వనిస్తోంది. బిజెపికి తాము దగ్గరగా ఉన్నట్లు సంకేతాలు చూపించారు కేటీఆర్. ఇన్ని రోజులు రేవంత్ రెడ్డి ని టార్గెట్ చేసుకున్నారు. ఇప్పుడు రాహుల్ గాంధీని లక్ష్యంగా చేసుకోవడం ద్వారా.. తాము బిజెపికి దగ్గర అనే సంకేతాలు ప్రజల్లోకి పంపించారు. మరో రెండేళ్లలో తెలంగాణ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న క్రమంలో కేటీఆర్ తాజాగా చేసిన కామెంట్స్ తెలంగాణ పొలిటికల్ సర్కిల్స్లో సరికొత్త సమీకరణలకు దారి తీయనున్నాయి. చూడాలి చివరకు ఏం జరుగుతుందో.

## ఈశాన్య ఢిల్లీలో కుప్పకూలిన 5 అంతస్థుల భవనం

**న్యూఢిల్లీ , (క్రైమ్ మిర్రర్):** దేశ రాజధాని ఢిల్లీలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఈశాన్య ఢిల్లీలోని సీమాపురి ప్రాంతంలో బుధవారం మధ్యాహ్నం ఓ ఐదు అంతస్తుల భవనం పేకమేడలా కుప్పకూలింది. కళ్లముందే భారీ భవనం నేలమట్టం కావడంతో ఆ ప్రాంతంలో తీవ్ర భయాందోళనలు, హాహాకారాలు చెలరేగాయి. భారీ ఎత్తున శబ్దం రావడంతో స్థానికులు భయంతో ఇళ్ల నుంచి రోడ్లపైకి పరుగులు తీశారు. బుధవారం మధ్యాహ్నం సుమారు 3:15 గంటల సమయంలో భవనం కూలిపోయినట్లు ఫైర్ కంట్రోల్ రూమ్కు సమాచారం అందింది. సమాచారం అందిన వెంటనే ఢిల్లీ అగ్నిమాపక సిబ్బంది, స్థానిక పోలీసులు, డిజాస్టర్ మేనేజ్మెంట్ బృందాలు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నాయి. శిథిలాల తొలగింపు చర్యలను వేగవంతం చేశాయి. జిల్లా డీసీపీ ఆర్తి బీనా స్వయంగా ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి సహాయక చర్యల్లో పాలుపంచుకున్నారు. శిథిలాల కింద చిక్కుకున్న ఇద్దరు చిన్నారులతో సహా మొత్తం నలుగురిని బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన వారిని వెంటనే సమీపంలోని రాజీవ్ గాంధీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. అయితే భవన యజమానితో పాటు ఒకే కుటుంబానికి చెందిన సుమారు ఆరుగురు వ్యక్తులు ఇంకా శిథిలాల కిందే చిక్కుకుని ఉన్నట్లు తెలుస్తోంది. శిథిలాల కింద ఊపిరాడక అల్లాడుతున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు రెస్క్యూ సిబ్బంది శ్రమిస్తున్నారు. ప్రమాదానికి గురైన భవనం కేవలం 25 చదరపు గజాల విస్తీర్ణంలోనే నిర్మించినట్లు ప్రాథమిక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. గ్రౌండ్ ఫ్లోర్లో దుకాణాలు ఉండగా, పైన నాలుగు అంతస్తులను నివాసాల కోసం కేటాయించారు. ఈ భవన నిర్మాణం గతేడాదే పూర్తయినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇంత తక్కువ విస్తీర్ణంలో సరైన పునాదులు, నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నాలుగు అంతస్తుల నిర్మాణం చేపట్టడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందా అనే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు. భవనం కూలిన ఘటనతో ఆ పరిసర ప్రాంతాల్లో తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఢిల్లీ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక అడ్వైజరీ జారీ చేశారు. సీమాపురి రౌండ్అబౌట్, డీఎల్ఎఫ్ భోపురా, పరిసర మార్గాల్లో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని, వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. సహాయక చర్యలకు, అంబులెన్స్ల రాకపోకలకు ఆటంకం కలగకుండా ఘటనా స్థలం వద్ద ప్రజలు గుమిగూడవద్దని, వాహనాలను రోడ్లపై నిలపవద్దని పోలీసులు హెచ్చరించారు. ప్రస్తుతం ఘటనా స్థలంలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

## యూపీలో ఘోర రోడ్డు ప్రమాదం..

### ముగ్గురు టెన్నిస్ క్రీడాకారులు మృతి

పూర్వాంచల్: ఉత్తరప్రదేశ్లోని పూర్వాంచల్ ఎక్స్ప్రెస్వేపై బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. రహదారిపై ఆగి ఉన్న ఒక ట్రక్కును కారు వెనుక నుంచి అతివేగంగా ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మృతులు, గాయపడిన వారందరినీ టెన్నిస్ క్రీడాకారులుగా పోలీసులు గుర్తించారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, అయోధ్య పరిధిలోని 97.500 మైలురాయి వద్ద బుధవారం వేకువజామున ఈ ప్రమాదం చోటుచేసుకుంది. లక్నోలో నిర్వహించిన ఒక టెన్నిస్ ఈవెంట్లో పాల్గొన్న ఆరుగురు యువకులు తిరిగి దేవరియాకు కారులో బయలుదేరారు. మార్గమధ్యంలో ఈ దుర్ఘటన జరిగింది. ప్రమాదం ధాటికి కారు ముందుభాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. వాహనంలో చిక్కుకున్న వారిని యూపీఈఐడీఏ భద్రతా సిబ్బంది, స్థానిక పోలీసులు అతికష్టం మీద వెలికితీశారు. ఈ ఘటనలో దేవరియాకు చెందిన నిత్యా ప్రజాపతి (22), ఇర్ఫాన్ అన్సారీ (20), అనికేత్ (24) మృతి చెందారు. ఆనంద్ యాదవ్ (23), రాజు (22), జయంత్ శర్మ (30) తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను తొలుత స్థానిక ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అయోధ్యలోని దర్శన్ నగర్ మెడికల్ కాలేజీకి తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో తామందరం నిద్రలో ఉన్నామని, అసలేం జరిగిందో కూడా తెలియలేదని గాయపడిన జయంత్ పోలీసులకు చెప్పాడు. ప్రమాదం జరిగిన వెంటనే ట్రక్కు డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పరారీలో ఉన్న ట్రక్కు డ్రైవర్ను గుర్తించేందుకు గాలింపు చర్యలు చేపట్టారు.

## సిర్పూర్-కాగజ్నగర్ రైలులో మంటలు

### ఒక్కసారిగా ఆందోళనకు గురైన ప్రయాణికులు

### యాదాద్రి జిల్లా బీబీనగర్ సమీపంలో ఘటన

హైదారాబాద్: యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ సమీపంలో బుధవారం ఉదయం సిర్పూర్–కాగజ్నగర్ వెళుతున్న రైలులో స్వల్ప అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనతో ప్రయాణికులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. అయితే, రైల్వే సిబ్బంది అప్రమత్తతతో వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే, రైలు బీబీనగర్ స్టేషన్ సమీపానికి చేరుకుంటున్న క్రమంలో, ఒక బోగీ చక్రానికి బ్రేక్ లైనర్లు పట్టేయడంతో ఏర్పడిన రాపిడి వల్ల పొగలు, మంటలు చెలరేగాయి. దీనిని వెంటనే గమనించిన కో–పైలట్, లోకో పైలట్ను అప్రమత్తంచేయడంతో రైలును బీబీనగర్ రైల్వే స్టేషన్లో నిలిపివేశారు. సమాచారం అందుకున్న రైల్వే సిబ్బంది, అగ్నిమాపక దళం హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు.

## భారత్లో ఈవీ వాహనాల అమ్మకాల జోరు..

### సెప్టెంబర్లో రికార్డు స్థాయిలో అమ్మకాలు



న్యూఢిల్లీ: భారత ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) మార్కెట్ సరికొత్త శిఖరాలకు చేరింది. సెప్టెంబర్ నెలలో ఈవీ రిటైల్ విక్రయాలు ఆల్ టైమ్ రికార్డును సృష్టించాయి. ఈ ఒక్క నెలలోనే దేశవ్యాప్తంగా 3,33,634 ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడవడం గమనార్హం. గతేడాది సెప్టెంబర్తో పోలిస్తే ఇది 74 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఈ గణాంకాలను ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ సమాఖ్య (ఫాడా) బుధవారం విడుదల చేసింది. ఈ గణాంకాలపై ఫాడా అధ్యక్షుడు సాయి గిరిధర్ స్పందిస్తూ, ఇది కేవలం గతేడాదితో పోల్చిన వృద్ధి మాత్రమే కాదని, ఒక సరికొత్త రికార్డు అని పేర్కొన్నారు. పండగ సీజన్ డిమాండ్, పెట్రోల్ ధరలతో పోలిస్తే తక్కువగా ఉన్న నిర్వహణ ఖర్చులు, మార్కెట్లోకి వస్తున్న కొత్త మోడళ్లు, పీఎం ఈ–డ్రైవ్ వంటి ప్రభుత్వ పథకాల ప్రోత్సాహం ఈ వృద్ధికి ప్రధాన కారణాలని ఆయన వివరించారు. ప్రస్తుతం ఈవీ మార్కెట్ కేవలం సబ్సిడీలపైనే కాకుండా, వినియోగదారుల డిమాండ్ ఆధారంగా పుంజుకుంటోందని ఆయన స్పష్టం చేశారు. విభాగాల వారీగా పరిశీలిస్తే, ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల విక్రయాలు 88.67 శాతం వృద్ధితో 2,07,314 యూనిట్లకు చేరాయి. అలాగే, ఎలక్ట్రిక్ ప్యాసింజర్ కార్ల విక్రయాలు 94.56 శాతం పెరిగి 36,108 యూనిట్లుగా నమోదయ్యాయి. ఈ రెండు విభాగాల్లోనూ అమ్మకాలు ఆల్ టైమ్ హై స్థాయికి చేరడం విశేషం. ఇదే సమయంలో ఎలక్ట్రిక్ త్రీ వీలర్ల విక్రయాలు 86,024 యూనిట్లుగా, కమర్షియల్ వాహనాల అమ్మకాలు 4,188 యూనిట్లుగా నమోదయ్యాయి. ఈ భారీ విక్రయాలతో దేశంలోని మొత్తం వాహన విక్రయాల్లో ఈవీల వాటా గతేడాది ఉన్న 10 శాతం నుంచి ప్రస్తుతం 13 శాతానికి పెరిగింది.

## ఢిల్లీలో పర్యటించనున్న సీఎం చంద్రబాబు

### ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులతో భేటీ చాన్స్?

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రెండు రోజుల పర్యటన నిమిత్తం ఢిల్లీకి పయనమయ్యారు. ఈరోజు మధ్యాహ్నం ఆయన హస్తినకు చేరుకోనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమై, రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై ఆయన చర్చించనున్నారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి, ప్రధాని మోదీతో పాటు కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, జలవనరుల శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్, ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీలతో భేటీ కానున్నారు. ప్రధానంగా విశాఖ మెట్రో రైల్, బీచ్ కారిడార్ ప్రాజెక్టులకు తక్షణ ఆమోదం తెలపాలని ఆయన ప్రధానిని కోరనున్నారు. అలాగే, ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితుల దృష్ట్యా సహాయక చర్యల కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ప్రధాని మోదీకి, హోంమంత్రి అమిత్ షాకు విజ్ఞప్తి చేయనున్నారు. వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాల నిర్వహణకు కేంద్రం నుంచి అవసరమైన ఆర్థిక సహకారం అందించాలని, రాయలసీమ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టును వేగవంతం చేయాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్తో జరిపే చర్చల్లో ముఖ్యమంత్రి ప్రస్తావించనున్నారు. గోదావరి నుంచి వృథాగా సముద్రంలోకి వెళుతున్న మిగులు జలాల సద్వినియోగం, నదుల అనుసంధానం ప్రాజెక్టుపై సమగ్ర అధ్యయనం చేయించడం వంటి అంశాలను కేంద్ర జలవనరుల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నారు. పర్యటనలో భాగంగా రేపు మధ్యాహ్నం 12 గంటలకు ఢిల్లీలో భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) నిర్వహించే 'భాగస్వామ్య సదస్సు' కర్టెన్ రైజర్ కార్యక్రమంలో కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్తో కలిసి చంద్రబాబు పాల్గొంటారు.

## పెట్టుబడులను ఆకర్షించేందుకు చర్యలు

**హైదారాబాద్, (క్రైమ్ మిర్రర్):** రాష్ట్రంలో పెట్టుబడులను మరింతగా ఆకర్షించడం, పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేయడం, తెలంగాణను దేశంలోనే అత్యుత్తమ పెట్టుబడి గమ్యస్థానంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఇన్వెస్ట్ తెలంగాణ గవర్నింగ్ కౌన్సిల్ తొలి సమావేశం బుధవారం డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని మరింత బలోపేతం చేయడం, పారిశ్రామికవేత్తలకు వేగవంతమైన అనుమతులు, మౌలిక వసతులు, అవసరమైన ప్రభుత్వ సహకారం అందించడం తదితర అంశాలపై సమావేశంలో సమీక్షించారు.తెలంగాణలో పెట్టుబడుల అవకాశాలను దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు, ఇప్పటికే పెట్టుబడులు పెట్టిన సంస్థలతో నిరంతరం సమన్వయం కొనసాగించాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. పెట్టుబడుల ప్రతిపాదనలను వేగంగా పరిశీలించి, వివిధ శాఖల మధ్య సమన్వయంతో నిర్ణీత కాలవ్యవధిలో కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి కల్పనలో అగ్రగామిగా నిలిపేందుకు ఇన్వెస్ట్ తెలంగాణ కీలక వేదికగా పనిచేయాలని సీఎస్ పేర్కొన్నారు.

GHMC
GREATER HYDERABAD MUNICIPAL CORPORATION
hmda
Growing Global
TS-bPASS

MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com



SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions

వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.

H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

# సింగరేణి ఆస్తుల పరిరక్షణలో అప్రమత్తత ప్రశంసనీయం: జీఎం రాధాకృష్ణ

## చోరీ యత్నాన్ని తిప్పికొట్టి విద్యుత్ మోటార్లను స్వాధీనం చేసుకున్న ఎంటీఎఫ్ సిబ్బందికి సన్మానం



**మందమర్రి, అక్టోబర్ 7 (క్రైమ్ మిర్రర్):** సింగరేణి సంస్థ ఆస్తుల పరిరక్షణలో ఎస్అండ్పీసీ, మొబైల్ ట్రాన్స్పోర్ట్ ఫోర్స్ సిబ్బంది ప్రదర్శించిన అప్రమత్తత, చాకచక్యం ఎంతగానో అభినందనీయమని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ అన్నారు. బుధవారం తెల్లవారుజామున సుమారు 5 గంటల ప్రాంతంలో మంజునాథ ఫంక్షన్ హాల్ ఎదురుగా ఉన్న సోలార్ ప్లాంట్ సమీపంలో విధులు నిర్వహిస్తున్న ఎంటీఎఫ్ సిబ్బందికి ఒక వ్యాన్ అనుమానాస్పదంగా కనిపించింది. వెంటనే స్పందించిన సిబ్బంది ఆ వాహనాన్ని తనిఖీ చేయగా, సింగరేణికి చెందిన రెండు విద్యుత్ మోటార్లను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. చోరీకి గురవుతున్న మోటార్లతో పాటు వ్యాన్ను స్వాధీనం చేసుకుని, దొంగతనానికి పాల్పడిన వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. సకాలంలో స్పందించి సంస్థ సొత్తును కాపాడిన సెక్యూరిటీ సిబ్బందిని జీఎం రాధాకృష్ణ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం వారిని శాలువాతో సన్మానించి, జ్ఞాపికలు మరియు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. సంస్థ ఆస్తులను కాపాడటం ప్రతి ఉద్యోగి ప్రథమ బాధ్యతని, సిబ్బంది ఇదే అప్రమత్తతతో విధులు నిర్వహించాలని సూచించారు. సంస్థకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించినప్పుడే సింగరేణి మరింత అభివృద్ధి పథంలో పయనిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వో టు జీఎం జి.ఎల్. ప్రసాద్, డీజీఎం (పర్సనల్) సీహెచ్. అశోక్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ వెంకటేశ్వర్రెడ్డితో పాటు పలువురు సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ సూర్య గిరి ఎల్లమ్మ గుడి రోడ్డు శంకుస్థాపనపై వివాదం... సబితా తీరుపై కాంగ్రెస్ ఫైర్

పదేళ్లు అధికారంలో ఉండి ఏం చేశారు..?

సబితా ఇంద్రారెడ్డిపై తుక్కుగూడ కాంగ్రెస్ నేతల విమర్శలు

సూర్య గిరి ఎల్లమ్మ గుడి రోడ్డు నిధులు కాంగ్రెస్ ఘనతే

బోధ పాండు రంగారెడ్డి



**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం నియోజకవర్గం రావిర్యాలోని ప్రముఖ పుణ్యక్షేత్రంమైన శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ దేవస్థానానికి వెళ్లే రోడ్డుకు మాజీ మంత్రి, మహే శ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మంగళ వారం శంకుస్థాపన చేయడాన్ని తుక్కుగూడ వార్డు కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా తుక్కుగూడ వార్డు కాంగ్రెస్ అధ్యక్షులు బోధ పాండు రంగారెడ్డి మాట్లాడుతూ.. పది సంవత్సరాలు అధికారంలో ఉండి, మంత్రిగా పనిచేసిన సబితా ఇంద్రారెడ్డి రావిర్యాల ఎల్లమ్మ గుడి రోడ్డు సమస్యను ఏనాడూ పట్టించుకోలేదని మండిపడ్డారు. భక్తులకు, గ్రామ ప్రజలకు రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ఎన్నిసార్లు అర్జీలు ఇచ్చినా స్పందించలేదని ఆరోపించారు. అధికారంలో ఉన్నప్పుడు గుర్తుకురాని అభివృద్ధి, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి పనులు చేస్తుంటే వచ్చి శంకుస్థాపనలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. గత ఐదు సంవత్సరాలు తుక్కుగూడ మున్సిపాలిటీలో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అధికారంలో ఉన్నా ఈ రోడ్డు విషయంలో ఏమీ చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో మహేశ్వరం నియోజకవర్గ ఇంచార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి చొరవతో, కృషితోనే ఎల్లమ్మ గుడి రోడ్డుకు నిధులు మంజూరయ్యాయని, ఇది పూర్తిగా కాంగ్రెస్ ప్రభుత్వ ఘనతేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ పేదల పక్షాన ఉంటూ అభివృద్ధి బాటలో నడుస్తోందని తెలిపారు. మాజీ మంత్రి తీరును భక్తులు, గ్రామ ప్రజలు గమనిస్తున్నారని, ఇలాంటి రాజకీయాలకు స్వస్తి పలకాలని పాండు రంగారెడ్డి డిమాండ్ చేశారు.

# అత్తాపూర్లో బైక్ స్టంట్లు.. ముగ్గురు యువకుల అరెస్ట్

సోషల్ మీడియాలో రీల్స్ కోసం ప్రమాదకర విన్యాసాలు..

పోలీసుల కఠిన చర్యలు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** పబ్లిక్ రోడ్లపై అత్యంత ప్రమాదకరంగా బైక్ స్టంట్లు చేస్తూ, అతివేగంగా వాహనాలు నడుపుతూ సోషల్ మీడియాలో వీడియోలు పోస్ట్ చేస్తున్న ముగ్గురు యువకులను అత్తాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. రోడ్డు భద్రతకు ముప్పు కలిగించేలా వ్యవహరించిన వారిపై మోటారు వాహనాల చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అత్తాపూర్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎ. సీతయ్య వివరాల ప్రకారం.. అక్టోబర్ 6 రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో అత్తాపూర్ పిల్లర్ నంబర్ 257, ఫ్లిప్కార్ట్ గోడౌన్ సమీపంలో ముగ్గురు యువకులు నంబర్ ప్లేట్లు లేని మూడు హోండా డియో ద్విచక్ర వాహనాలతో ప్రమాదకరంగా తిరుగుతున్నట్లు గుర్తించారు. వాహనాలను అతివేగంగా నడుపుతూ ప్రాణాంతకంగా స్టంట్లు చేస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ దృశ్యాలను ఇన్స్టాగ్రామ్లోనూ పోస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. సాధారణ ప్రయాణికు లకు భయాందోళనలు కలిగించేలా, రోడ్డు భద్రతకు ముప్పు కలిగించేలా వ్యవహరించినట్లు పేర్కొంటూ అత్తాపూర్ పెట్రోల్ కార్ ఇన్చార్జి కె. అంజనేయులు (హెచ్జీ–4321) ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశారు. దర్యాప్తులో ముగ్గురు నిందితులను గుర్తించి అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. అరెస్టయిన వారిలో మహమ్మద్ మోహినుద్దీన్ అలియాస్ మోహిన్ (24), మహమ్మద్ రిజ్వాన్ (21), తౌహిద్ (19) ఉన్నారు. వీరు హైదరాబాద్లోని కాచిగూడ, యాకుత్పురా తదితర ప్రాంతాలకు చెందినవారని పోలీసులు తెలిపారు.

**తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి..:** మైనర్లు, డ్రైవింగ్ లైసెన్స్ లేని పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వవద్దని పోలీసులు తల్లిదండ్రులను సూచించారు. సోషల్ మీడియా రీల్స్, వ్యూస్, లైక్స్ కోసం ప్రమాదకరమైన స్టంట్లకు పాల్పడకుండా పిల్లల కార్యకలాపాలను తల్లిదండ్రులు పర్యవేక్షించాలని కోరారు. లైసెన్స్ లేని వారికి వాహనాలు ఇచ్చి ప్రమాదాలకు కారణమైతే తల్లిదండ్రులపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**నంబర్ ప్లేట్ లేకుండా తిరిగినా చర్యలు...:** అత్తాపూర్, పీవీ నరసింహారావు ఎక్స్ప్రెస్వే పరిసరాల్లో రాంగ్రూట్లో ప్రయాణించడం, నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపడం, స్పీడ్ రేసింగ్, బైక్ స్టంట్లకు పాల్పడటం వంటి ఉల్లంఘనలను సహించబోమని అత్తాపూర్ పోలీసులు హెచ్చరించారు. సీసీటీవీ కెమెరాలు, సోషల్ మీడియా ద్వారా గుర్తించిన ఉల్లంఘనలపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల భద్రతకు ముప్పు కలిగించేలా వాహనాలు నడిపే వారిపై బీఎన్ఎస్, మోటారు వాహనాల చట్టం కింద కేసులు నమోదు చేస్తామని అత్తాపూర్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎ. సీతయ్య తెలిపారు.

# పరిశుభ్రతతోనే సీజనల్ వ్యాధుల నివారణ

కుందారం పీహెచ్సీ, గంగిపల్లి ఆరోగ్య కేంద్రాల్లో డీఎంహెచ్ఓ తనిఖీలు

పరిసరాలను స్వయంగా శుభ్రం చేసిన డాక్టర్ నరేందర్ రాథోడ్



**మంచిర్యాల అక్టోబర్ 7 (క్రైమ్ మిర్రర్):** ఆసుపత్రుల్లో పరిసరాల పరిశుభ్రతను పాటిస్తేనే సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా అరికట్టవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ అన్నారు. 'స్వచ్ఛ భారత్' కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అనిల్ కుమార్తో కలిసి ఆయన కుందారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గంగిపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. గంగిపల్లి కేంద్రంలో డీఎంహెచ్ఓ స్వయంగా సిబ్బందితో కలిసి ఆసుపత్రి ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. వైద్యసేవలపై రోగులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 2 నుంచి 31 వరకు అన్ని పీహెచ్సీలు, ఆయుష్మాన్ కేంద్రాలు, బస్తీ దవాఖానాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బయో వేస్టేజ్ మేనేజ్మెంట్పై సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం వైద్యాధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఆయుష్మాన్ కేంద్రాల్లో సిబ్బంది వేళలు పాటించాలని, ఆసుపత్రుల్లో ఉపయోగపడని వస్తువులను వెంటనే తొలగించాలని స్పష్టం చేశారు. వ్యాధి ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తుగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. వాతావరణ మార్పులతో డెంగీ, మలేరియా, చికెన్గున్యా, వైరల్ జ్వరాలు ప్రబలే ప్రమాదం ఉన్నందున ఆశా కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి జ్వర బాధితులను గుర్తించాలని సూచించారు. అలాగే టీబీ బాధితులను గుర్తించి ఉచితంగా మందులు అందజేయాలని, 30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. ప్రతి బుధ, శనివారాల్లో చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించాలని, 100 శాతం గర్భిణుల నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్లు, వైద్యాధికారులు డాక్టర్ శ్రావ్య, డాక్టర్ వేదశ్రీ, సిబ్బంది కస్తూరి, సాయి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# రూ.40 లక్షలతో సీసీ రోడ్లు ప్రారంభం

ముచ్చింతల్, రామాంజపూర్, నానాజీపూర్ గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నిధులు, ఎంపీ నిధులను సద్వినియోగం చేస్తూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాజేంద్రనగర్ నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని ముచ్చింతల్, రామాంజపూర్, నానాజీపూర్ గ్రామాల్లో ఎంపీ నిధులతో సుమారు రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డితో కలిసి తోకల శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. పూర్తయిన రోడ్లను పరిశీలించి అధికారికంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. సీసీ రోడ్ల నిర్మాణంతో ఆయా గ్రామాల్లో ప్రజల రాకపోకలకు మరింత సౌకర్యం కలగడంతో పాటు, వర్షాకాలంలో రోడ్లు బురదమయం కావడం, రాకపోకలకు ఇబ్బందులు ఎదురవడం వంటి సమస్యలకు పరిష్కారం లభించనుందని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక వసతులు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, డ్రైనేజీ, తాగునీరు తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ఎంపీ నిధులతో నిర్మించిన ఈ సీసీ రోడ్లు ఆయా గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతూ ఎంపీ నిధుల ద్వారా ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి కేవలం హామీలకే పరిమితం కాకుండా, ప్రజలకు కనిపించే విధంగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావడమే బీజేపీ లక్ష్యమని శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, ప్రతి కాలనీ అభివృద్ధి చెందే వరకు ప్రజలతో కలిసి నిరంతరం పనిచేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు కత్తుల సుభాష్, దేవేందర్, మైలారం సురేఖ రాజు, బీజేపీ జిల్లా నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# కీర్తిశేషులు గాజుల అభినయ్ రాజ్ జ్ఞాపకార్థం కొత్త బస్టాండ్ లో భోజన ఏర్పాటు..

కుమారుని జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమాలు...



**దేవరకొండ టౌన్ అక్టోబర్ 07 క్రైమ్ మిర్రర్ ప్రతినిధి.:** లయన్స్ క్లబ్ ఆఫ్ దేవరకొండ ఇచ్చిన పిలుపు మేరకు పితృపక్ష వారోత్సవాల్లో భాగంగా పట్టణానికి చెందిన ఫాస్ట్ రీజియన్ చైర్మన్ గాజుల రాజేష్ జోన్ చైర్మన్ లయన్ గాజుల ఉషారాణి కుమారుడు గాజుల అభినవ్ రాజ్ జ్ఞాపకార్థం బుధవారం స్థానిక కొత్త బస్టాండ్ ఆవరణలో ప్రయాణికులకు ఉచితంగా భోజనాన్ని దంపతులు అందించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ దేవరకొండ ప్రెసిడెంట్ గుద్దేటి జంగయ్య మాట్లాడుతూ... ఇటీవల రాజేష్ దంపతుల కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని పితృ వారోత్సవాలలో కుమారుని ఆత్మకు శాంతి చేకూరాలని అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. దంపతులు సైతం ఇలాంటి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయం అని తెలిపారు. నేటితో మొదలు మరో రెండు రోజులు సైతం అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. సుమారు 200 మందికి అన్నదానం చేయగా బస్టాండ్ లోని వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు అభినయ్ రాజ్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గుద్దేటి జంగయ్య, ప్రధాన కార్యదర్శి కాశిరెడ్డి రవీందర్ రెడ్డి, కోశాధికారి చిలుకూరి కాశీనాథ్ ,జోన్ చైర్మన్ గాజుల ఉషారాణి ,గాజుల రాజేష్, తిప్పర్తి రుక్మారెడ్డి, అవిరనేని వెంకటేశ్వరరావు, దినేష్, రాజు, నీల బుచ్చయ్య, ఎన్ ఎన్ చారి ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు..

# నిరుద్యోగ యువతకు శిక్షణతో కూడిన ఉపాధి మేళా

ఈనెల 12వ తేదీన ఓల్డ్ సిటీ ప్రభుత్వ ఐటీఐలో అప్రెంటిస్షిప్ నిర్వహిస్తున్న వెల్లడించిన ప్రిన్సిపల్ రేణుక




**హైదరాబాద్ (క్రైమ్ మిర్రర్):** పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం కలిగిన యువతకు ఉపాధి, అప్రెంటిస్షిప్ అవకాశాలు కల్పించేందుకు ప్రధాన్ మంత్రి నేషనల్ అప్రెంటిస్షిప్ పథకంగాలో భాగంగా ఈనెల 12వ తేదీన జూపార్క్ ఎదురుగా ఉన్న ఓల్డ్ సిటీ ప్రభుత్వ ఐటీఐ ఆవరణలోఅప్రెంటిస్షిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రేణుక తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు కొనసాగే ఈ మేళాలో ప్రభుత్వ రంగ , ప్రైవేటు సంస్థలు, తయారీ, సేవా రంగాలకు చెందిన వివిధ పరిశ్రమలు నిర్వాహకులు అర్హులైన అభ్యర్థులను నేరుగా ఎంపిక చేసుకుంటారని ఆమె చెప్పారు. అప్రెంటిస్షిప్ చట్టం కింద సాంకేతిక మానవ వనరుల ఎంపిక కోసం జరిగే ఈ మేళాలో టెక్నికల్ ట్రైనీలు, ఐటీఐ ఉత్తీర్ణులు, అల్యూమ్ని విద్యార్థులతో పాటు ఎస్ఎస్సీ, డిగ్రీ, డిప్లొమా అర్హతలు కలిగిన అభ్యర్థులు హాజరై ఉపాధి అవకాశాలు పొందాలని ఆమె కోరారు. రంగారెడ్డి , హైదరాబాద్ జిల్లాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలు, ఒకేషనల్ సంస్థలు, టెక్నికల్ ట్రైనింగ్ సెంటర్లు తమ చివరి సంవత్సరం విద్యార్థులు, శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులు, అల్యూమ్ని విద్యార్థులను ఈ మేళాకు హాజరయ్యేలా ప్రోత్సహించాలని ప్రిన్సిపాల్ రేణుక కోరారు.

# సిబిఐటీలో ఘనంగా ఐఈఈఈ డే 2026

**100కు పైగా పోస్టర్లతో విద్యార్థుల ప్రతిభ ప్రదర్శన**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సిబిఐటి), హైదరాబాద్‌లో మెరుగైన రేపటి కోసం సాంకేతికతను వినియోగించుకోవడం అనే ఇతివృత్తంతో ఐఈఈఈ డే--2026ను ఘనంగా నిర్వహించారు. సిబిఐటి ఐఈఈఈ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల్లో నూతన ఆవిష్కరణలు, పరిశోధనా దృక్పథం, సాంకేతిక పరిజ్ఞానం, జ్ఞాన భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేలా పోస్టర్ ప్రజెంటేషన్లు నిర్వహించారు. కార్యక్రమానికి ఐఈఈఈ పీఈఎస్ ఇండియా చాప్టర్స్ కౌన్సిల్ చైర్మన్, ల్యూసఎస్ ఇన్నోవేషన్ కన్సల్టింగ్ సీటీఓ డా. వీఎస్‌కే మూర్తి బాల్జేపల్లి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సిబిఐటి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డా. సి.వి. నరసింహులు విద్యార్థుల సాంకేతిక కార్యకలాపాలు, పరిశోధన, నూతన ఆవిష్కరణలు, వృత్తిపరమైన అభివృద్ధికి ప్రోత్సాహం అందించారు. పోస్టర్ ప్రజెంటేషన్‌కు హైదరాబాద్‌లోని వివిధ ఇంజినీరింగ్ కళాశాలల నుంచి విశేష స్పందన లభించింది. 100కు పైగా పోస్టర్లను విద్యార్థులు సమర్పించారు. వీఎన్ఆర్ విజేఐఈటీ, జి. నారాయణమ్మ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, వర్ధమాన్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, వాసవి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, జి. పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్, సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కాలేజ్, శ్రీదేవి ఉమెన్స్ ఇంజినీరింగ్ కాలేజ్ తదితర సంస్థల విద్యార్థులు పాల్గొన్నారు. పోస్టర్ ప్రజెంటేషన్‌లో ప్రథమ బహుమతి సిబిఐటి, ద్వితీయ బహుమతి జీఎన్ఐటీ, తృతీయ బహుమతి వీఎన్ఆర్ విజేఐఈటీ విద్యార్థులు సాధించారు. డా. టి. అరవింద్ బాబు, డా. సుజాత గుప్తా, డా. ఈ. రామలక్ష్మి నూతనత్వం, సాంకేతిక అంశాలు, అంశ ప్రాసంగికత, ప్రజెంటేషన్ నాణ్యత తదితర ప్రమాణాల ఆధారంగా విజేతలను ఎంపిక చేశారు. కార్యక్రమానికి డా. టి. సుధాకర్ బాబు, డా. ఎస్. శివ ప్రియాంక, డా. రమణ, డా. సాగర్ జి., డా. ఖలీలుర్ రహమాన్ ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లుగా సహకరించారు. విద్యార్థి వ్యవహారాల అసిస్టెంట్ డైరెక్టర్ డా. సి. నాగేంద్రనాథ రెడ్డి విద్యార్థుల సాంకేతిక కార్యక్రమాలకు సహకారం అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డా. సి.వి. నరసింహులు ఫ్యాకల్టీ కోఆర్డినేటర్లు, వాలంటీర్లను వారి కృషి, అంకితభావం, చురుకైన భాగస్వామ్యానికి అభినందించారు.



# ఆశా వర్కర్లకు జీతాలు ఎక్కడ? -- సీఐటీయూ

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ఆశా వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న సెప్టెంబర్ నెల జీతాలను వెంటనే చెల్లించాలని గండిపేట మండల సీఐటీయూ కమిటీ నాయకులు పుల్లారావుడిమాండ్ చేసింది. అక్టోబర్ 7వ తేదీ వచ్చినా జీతాలు అందకపోవడంపై సీఐటీయూ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. గండిపేట మండల సీఐటీయూ ఆధ్వర్యంలో నార్సింగి ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన నాయకులు ఆశా వర్కర్ల సమస్యలను తెలుసుకున్నారు. జీతాలు ఆలస్యం కావడంతో పాటు సర్వేలు, డేటా ఎంట్రీ, ఆసుపత్రి డ్యూటీలు, పల్స్ పోలియో వంటి పనులతో అధిక పనిభారం పడుతోందని ఆరోపించారు. ఆశా వర్కర్లకు ప్రతి నెల 1వ తేదీన జీతాలు చెల్లించాలని, పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని, పనిభారం తగ్గించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రూ.26 వేల కనీస వేతనం, ప్రమాద బీమా, రిటైర్మెంట్ ప్రయోజనాలు కల్పించాలని కోరింది. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# బాక్సింగ్‌లో సత్తా చాటిన చిన్నారులను అభినందించిన మాద్రి పృథ్వీరాజ్



**జిల్లా స్థాయి పోటీల్లో గోల్డ్, సిల్వర్ మెడల్స్ కైవసం**

**రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన గౌరీష్, మైఖేల్, భవేష్**

**క్రీడాకారులకు ఎండీఆర్ ఫౌండేషన్ అండగా ఉంటుందన్న పృథ్వీరాజ్**

పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 07: బాక్సింగ్‌లో పటాన్‌చెరు చిన్నారులు ప్రతిభ చాటారు. బీఎన్ఆర్ బాక్సింగ్ అకాడమీకి చెందిన గౌరీష్, మైఖేల్, భవేష్‌లు సిద్దిపేటలో జరిగిన జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచారు. గౌరీష్, మైఖేల్‌లు గోల్డ్ మెడల్స్ సాధించగా, భవేష్ సిల్వర్ మెడల్ సాధించాడు. దీంతో ముగ్గురు ఈ నెల 12న భూపాలపల్లిలో జరగనున్న రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులు ఎండీఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్‌ను కలిసి తమ విజయాలను వివరించారు. ఈ సందర్భంగా అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన క్రీడాకారులను పృథ్వీరాజ్ అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు మైఖేల్‌కు ఎండీఆర్ ఫౌండేషన్ తరపున ఆర్థిక సహాయం అందించేందుకు పృథ్వీరాజ్ ముందుకు వచ్చారు. మైఖేల్ తండ్రి ఇంద్రేశం వికర్స్ సెక్షన్ కాలనీలో చెత్త బండి నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. కుమారుడికి బాక్సింగ్‌పై ఉన్న ఆసక్తిని గుర్తించి అకాడమీలో చేర్పించి ప్రోత్సహించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ కుమారుడి క్రీడా ప్రతిభను ప్రోత్సహిస్తున్న తండ్రిని పలువురు అభినందించారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహిస్తూ వారి భవిష్యత్ విజయాలకు ఎండీఆర్ ఫౌండేషన్ అండగా ఉంటుందని పృథ్వీరాజ్ తెలిపారు. క్రీడల్లో రాణిస్తున్న యువతను ప్రోత్సహించడం ద్వారా మరింత మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.



# కాంగ్రెస్ పార్టీలో చేరిన ఒకటో వార్డు కౌన్సిలర్

**కాంగ్రెస్ పార్టీ చేస్తున్నటువంటి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై భారీగా చేరికలు**

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మున్సిపల్ పట్టణంలోని లక్ష్మీ గార్డెన్ లో బుధవారం కాంగ్రెస్ పార్టీ సమావేశం పట్టణ పార్టీ అధ్యక్షులు ఎద్దులపురి కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో చిట్యాల మున్సిపాలిటీకి చెందిన 1వ వార్డు శివనేనిగూడెం ఇండిపెండెంట్ కౌన్సిలర్ నాగిళ్ల సుధాకర్ అలియాస్ కావేరి తన 200 మంది అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా స్పోక్స్ పర్సన్ పోకల దేవదాసు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా పోకల దేవదాసు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై కౌన్సిలర్ పార్టీలోకి రావడం సంతోషంగా ఉందని, 200 మందితో కలిసి రావడంతో చిట్యాలలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. అనంతరం నాగిళ్ల సుధాకర్ అలియాస్ కావేరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపడుతున్న పాలన, ఎమ్మెల్యే వేముల వీరేశం చేస్తున్న అభివృద్ధి నచ్చి కాంగ్రెస్ లో చేరానని, వార్డు అభివృద్ధికి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పందిరి గీతా రమేష్, వైస్ చైర్మన్ గుండెబోయిన లక్ష్మీ సైదులు, కౌన్సిలర్లు దేశపాక లత, బొబ్బిలి సందీప్, ఏర్పుల పరమేష్, జక్రిపోతుల సత్యనారాయణ గౌడ్, గాలి యాదమ్మ, కో ఆప్షన్ సభ్యులు బెల్లి సత్తయ్య, ఇమ్రాన్, షహది ఇబ్రహీం, మండల పార్టీ అధ్యక్షులు జడల చిన్న మల్లయ్య, నాయకులు పాటి నర్సిరెడ్డి, పాటి మాధవరెడ్డి, ఇమ్మడి వెంకటేశ్వర్లు, కొసనం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# లారీ ఢీకొన్న విద్యుత్ స్తంభానికి మరమ్మతులు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** లారీ ఢీకొనడంతో ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభానికి బుధవారం విద్యుత్ శాఖ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. రెండు రోజుల క్రితం బుద్వేల్ ప్రధాన రహదారిపై అర్ధరాత్రి సమయంలో ఓ లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో అది ఒకవైపు ఒరిగిపోయి ప్రమాదకరంగా మారింది. విషయం గుర్తించిన స్థానిక శ్రీనివాస సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పెండ్యాల సాయి మల్లిక్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన విద్యుత్ శాఖ సిబ్బంది బుధవారం ఉదయం స్తంభానికి మరమ్మతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి మల్లిక్ మాట్లాడుతూ.. రాత్రి వేళల్లో భారీ వాహనాల రాకపోకల కారణంగా ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రమాదాలకు కారణమవుతున్న భారీ వాహనాలను నియంత్రించడంతో పాటు రహదారిపై భారీ వాహనాల పార్కింగ్, రాకపోకలను నిషేధించాలని అధికారులను కోరారు.

# జల్పల్లిలో ప్లాస్టిక్ ఫర్నీచర్ గోదాంలో భారీ అగ్నిప్రమాదం

**అర్ధరాత్రి చెలరేగిన మంటలు.. అప్రమత్తమైన పోలీసులు..తప్పిన ప్రాణనష్టం..ప్లాస్టిక్ గోదాంలోదగ్ధమైన లక్షల విలువైన ఫర్నీచర్...!**

**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** రంగారెడ్డి జిల్లా :పహాడి షరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధి జల్పల్లిలో అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. జల్పల్లి పరిధిలోని పవన్ ప్లాస్టో క్రాఫ్ట్ అనే ప్లాస్టిక్ ఫర్నీచర్ గోదాంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.తెల్లవారుజామున 1:20 గంటల ప్రాంతంలో మంటలు ఎగసిపడుతున్నట్లు సమాచారం అందగానే పహాడీషరీఫ్ పోలీసులు అప్రమత్తమయ్యారు. బ్లూ కోల్ట్స్ సిబ్బందితో కలిసి ఇన్‌స్పెక్టర్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పోలీస్ కంట్రోల్ రూం, అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న వెంటనే రెండు ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చాయి.ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని పోలీసులు తెలిపారు. అయితే గోదాంలో ఉన్న ప్లాస్టిక్ కుర్చీలు, ఫంక్షన్ హాల్ స్టీల్ కుర్చీలు, ఇతర ప్లాస్టిక్ సామాగ్రి పూర్తిగా కాలిపోయి లక్షల్లో ఆస్తి నష్టం జరిగినట్లు పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.





# చీకురి ప్రేమ్ నందన్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలం లో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.20 వేల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును చీకురి ప్రేమ్ నందన్‌కు బుధవారం పంపిణీ చేశారు. నకిరేకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశం ఆదేశాల మేరకు ఈ చెక్కును అందజేశారు.ఈ కార్యక్రమంలో బోయగుబ్బ ఉపసర్పంచ్ బొమ్మగోని లింగస్వామి, 1వ వార్డు సభ్యులు బొమ్మగోని మంగమ్మ రాజు, 5వ వార్డు సభ్యులు గండమళ్ల అండాలు భీమార్జున్, 6వ వార్డు సభ్యులు అంతటి రాము, 7వ వార్డు సభ్యులు గురిజ గోపమ్మ లింగస్వామి, 8వ వార్డు సభ్యులు రెడ్డిమల్ల పరమేష్ పాల్గొన్నారు.అలాగే కాంగ్రెస్ సీనియర్ నాయకులు బీరం రత్నారెడ్డి, గురిజ పరమేష్, రేగులగడ్డ జంగయ్య, రెడ్డిమల్ల నరసింహ, రేగులగడ్డ మల్లయ్య, బొల్లం భీమయ్య, చేకూరి శేఖర్, ఆదే పార్వతాలు, రేగులగడ్డ సురేష్ తదితరులు పాల్గొన్నారు.అవసరమైన సమయంలో ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా సహాయం అందేలా కృషి చేస్తున్న ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశంకు వారు కృతజ్ఞతలు తెలిపారు.



**క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు**

**కంటెంట్ రైటర్లు కావలెను**

**సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం**



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595

# కాటేదాన్--గగన్‌పహాడ్ రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం

**మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీజేపీ పార్టీ అధ్యక్షుడు సురెడ్డి వినయ్‌రెడ్డి**



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** కాటేదాన్--గగన్‌పహాడ్ ప్రధాన రహదారి సమస్యకు అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీజేపీ పార్టీ అధ్యక్షుడు సురెడ్డి వినయ్‌రెడ్డి కోరారు. బుధవారం స్థానిక నాయకులు, ప్రజలతో కలిసి ఆయన పర్యటించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కాటేదాన్--గగన్‌పహాడ్ ప్రధాన రహదారిపై జలమండలికి సంబంధిత పనులు 3--4 సంవత్సరాలుగా కొనసాగుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రహదారిపై పలుచోట్ల తవ్వకాలు, గుంతలు, దెబ్బతిన్న రోడ్డు కారణంగా వాహనాదారులు, స్థానిక ప్రజలు ప్రతిరోజూ ఇబ్బదులు పడుతున్నారన్నారు. పర్జల అవసరాల కోసం చేపట్టే నీటి, డ్రైనేజీ పనులు అవరమే అయినప్పటికీ పనులు పూర్తయిన ప్రాంతాల్లో రహదారులను వెంటనే పునరుద్ధరించడం కూడా సంబంధిత అధికారుల బాధ్యత అన్నారు. సంవత్సరాల తరబడి సమస్య కొనసాగడం వల్ల ప్రజలకు సమయం, ఇంధనం వృథా కావడంతో పాటు ప్రమాదాల ముప్పు కూడా పెరుగుతుందన్నారు. ఈ సమస్యపై జలమండలి అధికారులు సమగ్రంగా పరిశీలించి పెండింగ్ పనులను నిర్దిష్ట గడువులో పూర్తి చేసి రహదారిని నాణ్యత ప్రమాణాలతో పునరుద్ధరించాలన్నారు. జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు సమన్వయంతో పని చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా స్థానిక ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ ప్రజలు ఎదుర్కొంటున్న ఈ సమస్యపై తక్షణమే స్పందించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి పరిష్కారం చూపాలని కోరారు. ప్రజా సమస్యలపై నిరంతర పర్యవేక్షణ, అధికారులపై బాధ్యత నిర్ధారించడం అవసరమన్నారు. ప్రజలు సంవత్సరాల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి లేకుండా కాటేదాన్--గగన్‌పహాడ్ రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఈ పర్యటనలో నాయకులు బీజేపీ ఎస్సీ మోర్చా పార్లమెంట్ కన్వీనర్ జోగు రవి, ఓబీసీ స్టేట్ నాయకులు అడికే రాజు, అడికే మహేందర్ తదితరులున్నారు.

# ఖానాపూర్‌లో డిప్యూటీ కమిషనర్ పర్యటన..
# సమస్యలపై ప్రత్యక్ష పరిశీలన

## వన్ డే -- వన్ వార్డ్ కార్యక్రమంలో భాగంగా పౌర సమస్యలపై ఆరా

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** వన్ డే -- వన్ వార్డ్ కార్యక్రమంలో భాగంగా నార్సింగి సర్కిల్--45 డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి ఖానాపూర్ గ్రామం, వార్డు నం.126లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులతో మాట్లాడి గ్రామంలో నెలకొన్న పౌర సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకున్నారు. పర్యటనలో భాగంగా ఫిరంగి నాలా, భూగర్భ మురుగు కాలువలు, రహదారులు, మంచినీటి సరఫరా, పారిశుద్ధ్య పరిస్థితులు తదితర ప్రాంతాలను డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి పరిశీలించారు. ఫిరంగి నాలాలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని స్థానికులు కోరారు. గ్రామంలోని భూగర్భ మురుగు కాలువలను పరిశీలించి, మురుగు నిల్వలు ఏర్పడకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. అలాగే ఖానాపూర్‌లో మంచినీటి సమస్య లేకుండా చూడాలని, దోమల బెడదను అరికట్టేందుకు పారిశుద్ధ్య చర్యలు, ఫాగింగ్ తదితర కార్యక్రమాలను చేపట్టాలని స్థానికులు డిప్యూటీ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో రహదారి సౌకర్యం సరిగా లేకపోవడంతో సుమారు 1.5 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించాలని కూడా ప్రజలు విజ్ఞప్తి చేశారు. స్థానికులు తెలిపిన సమస్యలను డిప్యూటీ కమిషనర్ నేరుగా విని, వాటిని ప్రాధాన్యతా క్రమంలో పరిశీలించి, సాంకేతికంగా సాధ్యమైన మేరకు అందుబాటులో ఉన్న వనరులతో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గుర్తించిన సమస్యలపై ఇంజినీరింగ్, శానిటేషన్, ఇతర ఫీల్డ్ సిబ్బంది వెంటనే పరిశీలన చేసి అవసరాలను అంచనా వేసి తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వన్ డే -- 



వన్ వార్డ్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి వేగవంతమైన పరిష్కారాలు అందించేందుకు నార్సింగి సర్కిల్--45 అధికారులు కృషి చేస్తున్నారని ఈ పర్యటన స్పష్టం చేసింది. ఈ కార్యక్రమంలో ఏఈ సంతోష్, బిల్ కలెక్టర్ రవీందర్ రెడ్డి, వార్డ్ ఆఫీసర్ ప్రభాకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లచ్చిరాం, వర్క్ ఇన్‌స్పెక్టర్లు శేఖర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.




# కాళీమందిర్‌లో ఘనంగా సేవా సంకల్ప్ జ్యోతి యాత్ర

### పెద్ద సంఖ్యలో పాల్గొన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలు

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని కాళీమందిర్ సమీపంలో సేవా సంకల్ప్ జ్యోతి యాత్రను ఘనంగా నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు పంతంగి రాజు భూపాల్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి యాత్రలో పాల్గొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 సంవత్సరాల ప్రజా ప్రతినిధి ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ సందేశాన్ని లైవ్ ద్వారా కార్యక్రమానికి హాజరైన వారికి ప్రదర్శించారు. దేశ అభివృద్ధి, ప్రజా సేవ, వికసిత్ భారత్ లక్ష్య సాధనకు సంబంధించిన సందేశాన్ని పార్టీ శ్రేణులు ఆసక్తిగా వీక్షించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అడికే రాజు, ఆడికే మహేందర్, జోగి రవి, వినయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తలు జ్యోతి యాత్రలో ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మహిళా సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులకు దుస్తుల పంపిణీ



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మండలంవెలిమినేడు మహిళా సంఘాల బలోపేతంలో భాగంగా ప్రభుత్వం అందించిన పెట్టుబడులతో మహిళా సంఘాల ద్వారా తయారు చేసిన దుస్తులను వెలిమినేడు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న హైస్కూల్ బాలబాలికలకు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొంతల చంద్రారెడ్డి, ఉప సర్పంచ్ అంతటి స్వప్న సత్తయ్య గౌడ్, హైస్కూల్ హెచ్ఎం అరుణ, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం శ్రీనివాస్, వివికెలు ఆరూరి కలమ్మ, మహంకాళి వనజ, చింతకింది సుమతి, ఉంగరాల సుభాష్, సంఘ బంధం అధ్యక్షురాలు కొంపెల్లి మానస, ఉపాధ్యక్షురాలు ఏనుగు చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

# అపరిచిత కాల్స్.. తస్మాత్ జాగ్రత్త!

### ఓటీపీ, పిన్, పాస్‌వర్డ్‌లు చెప్పొద్దు: ఎస్ఐ వెంకటేశ్వర్లు




**మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్, అక్టోబరు 7 :** అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మిర్యాలగూడ వన్‌టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు సూచించారు. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, ఏమాత్రం అనుమానం వచ్చినా స్పందించవద్దని తెలిపారు.కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు ఫేక్ కాల్స్, ఫిషింగ్ లింకులు, ఓటీపీ పేరుతో మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. విద్యార్థులు అప్రమత్తంగా ఉంటే సైబర్ మోసాలను అడ్డుకోవచ్చన్నారు.ఓటీపీ, ఏటీఎం పిన్, పాస్‌వర్డ్‌లు, బ్యాంకు ఖాతా వివరాలను అపరిచితులకు ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పొద్దని సూచించారు. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకూడదని, సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని తెలిపారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే నష్టాన్ని తగ్గించుకోవచ్చన్నారు.కళాశాల ప్రిన్సిపల్ మల్గిరెడ్డి భీమార్జునరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో సైబర్ నేరాల బారిన పడకుండా ఉండేలా ప్రతిజ్ఞ చేయించారు.కార్యక్రమంలో అధ్యాపకులు నాగరాజు, రవీందర్, లింగరాజు, పోలీస్ అధికారులు శ్రీనివాస్, సైదులు, ప్రసాద్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# నెమలి నగర్ సమస్యల పరిష్కారానికి అధికారులను కలిసిన వాసిరెడ్డి నరేష్

### చెత్త సేకరణ, దోమల నివారణ, తాగునీటి సమస్యలపై వినతిపత్రాలు



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** మణికొండ డివిజన్ పరిధిలోని నెమలి నగర్ కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త -- మీడియా, కమ్యూనికేషన్స్ వాసిరెడ్డి నరేష్ ఆధ్వర్యంలో నెమలి నగర్ అసోసియేషన్ ప్రతినిధులు సంబంధిత అధికారులను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా నెమలి నగర్ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల అశోక్, ఉపాధ్యక్షుడు నాగేష్ గౌడ్, జాయింట్ సెక్రటరీ జగన్మోహన్, కోశాధికారి ఎం. రమణజనేయులు తదితరులు నార్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డిని కలిసి కాలనీలో నెలకొన్న సమస్యలను వివరించారు. ప్రధానంగా కాలనీలో చెత్త సేకరణ వారానికి కేవలం రెండుసార్లు మాత్రమే జరుగుతోందని, సరైన డస్ట్‌బిన్లు లేకపోవడంతో కొందరు రోడ్లపై చెత్త వేస్తున్నారని తెలిపారు. దీంతో దుర్వాసనతో పాటు దోమల బెడద పెరుగుతోందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కాలనీలో రోజువిడిచి రోజు చెత్త సేకరణ, అవసరమైన చోట్ల డస్ట్‌బిన్ల ఏర్పాటు, దోమల నివారణకు క్రమం తప్పకుండా ఫాగింగ్, స్ప్రేయింగ్ నిర్వహించాలని వాసిరెడ్డి నరేష్ కోరారు. దీనిపై డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి సానుకూలంగా స్పందించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి మేనేజర్ మజీద్ను కలిసి తాగునీటి సమస్యపై వినతిపత్రం సమర్పించారు. నెమలి నగర్‌లో ఒక్కో క్వార్టర్‌లో 24 ఫ్లాట్లు ఉండగా, మొత్తం 18 క్వార్టర్లకు ఒక్కో క్వార్టర్‌కు ఒకే నీటి కనెక్షన్ ఉండటంతో సరిపడా నీరు అందడం లేదని వివరించారు. ప్రస్తుతం రోజువిడిచి రోజు కేవలం గంటసేపు మాత్రమే నీటి సరఫరా జరుగుతోందని, దీంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రతి 24 ఫ్లాట్ల క్వార్టర్‌కు అదనంగా మరో నీటి కనెక్షన్ మంజూరు చేయాలని, కొత్త కనెక్షన్లు ఏర్పాటు చేసే వరకు ప్రస్తుత కనెక్షన్ ద్వారా అదనపు సమయం నీటిని సరఫరా చేయాలని కోరారు. అలాగే భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నెమలి నగర్‌లో ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మించాలని హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి అధికారులను విజ్ఞప్తి చేశారు. నెమలి నగర్ ప్రజలు ఎదుర్కొంటున్న చెత్త, పారిశుధ్యం, దోమలు, తాగునీరు తదితర సమస్యల పరిష్కారానికి అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ పనిచేస్తామని వాసిరెడ్డి నరేష్ తెలిపారు. కాలనీ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు.




# ఘనంగా సేవా జ్యోతి ర్యాలీ -- వికసిత్ భారత్ సంకల్ప సభ

### నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవకు కృతజ్ఞతగా బీజేపీ ఆధ్వర్యంలో కార్యక్రమం

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవకు కృతజ్ఞతలు తెలుపుతూ బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్లో భాగంగా వా జ్యోతి ర్యాలీ -- వికసిత్ భారత్ సంకల్ప సభ" కార్యక్రమాన్ని బుధవారం కాళీమందిర్‌లోని వీరభద్ర ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కొండే గణేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువమోర్చా, మహిళా మోర్చా శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సందర్భంగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవా ప్రస్థానం దేశ అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనకు అంకితమైందని పేర్కొన్నారు. మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ వేదికపై బలమైన శక్తిగా ఎదుగుతోందని తెలిపారు. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ర్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి, అంజన్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కె.ఎస్. రత్నం, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మమతా రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్, వై. శ్రీధర్, నిరుడు శేఖర్ ముదిరాజ్, బుర్ర అభినయ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బండ్లగూడ జాగీర్ బీజేపీ అధ్యక్షుడు కొండే మహేష్ యాదవ్, ఉపాధ్యక్షుడు నరేష్ యాదవ్, స్వర్ణలత--భీమార్జున రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నిరుడు శేఖర్ ముదిరాజ్, మహాలింగం, మల్లారెడ్డి, పవన్ సాయి, ఎస్. శ్రీనివాస్, నాగరాజు తదితర నాయకులు హాజరయ్యారు. ధాని మోదీ ప్రజా సేవకు కృతజ్ఞతలు తెలుపుతూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నారు. దేశ అభివృద్ధి, ప్రజా సేవే లక్ష్యంగా ముందుకు సాగుతామని ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు సేవా సంకల్పం వ్యక్తం చేశారు.



# మంచిరేవులలో ఘనంగా పోషణ పక్షం కార్యక్రమం

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** మంచిరేవుల గ్రామంలో పోషణ పక్షం కార్యక్రమాన్ని ఆరోగ్య శాఖ, పాఠశాల సిబ్బంది, అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణ, పరిశుభ్రత, సమతుల్య ఆహారం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు అవసరమైన పోషకాహారం అందించడం తల్లిదండ్రుల బాధ్యత అని సిబ్బంది సూచించారు. మంచిరేవుల విలేజ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ సిబ్బంది, స్కూల్ హెడ్‌మాస్టర్‌తో పాటు అంగన్వాడీ టీచర్లు సుధారాణి, అనిత, నలిని కార్యక్రమంలో పాల్గొని పోషణ, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు.



# దుర్గానగర్ కాలనీలో మౌలిక వసతుల పరిశీలన

### అధికారులతో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పర్యటన

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని దుర్గానగర్ కాలనీలో రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అధికారులతో కలిసి బుధవారం పర్యటించారు. కాలనీలో నెలకొన్న మురుగు కాలువ, నాలా సమస్యలు, అండర్ గ్రౌండ్ డ్రై నేజీ వ్యవస్థ, సీసీ రోడ్ల అవసరాలను స్థానికులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సంబంధిత అధికారులతో అక్కడికక్కడే చర్చించి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రై నేజీ ఏర్పాటు, మోరి--నాలా సమస్య పరిష్కారం, సీసీ రోడ్ల నిర్మాణం ద్వారా ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తెలిపారు. ఈ పర్యటనలో అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మల్లయ్య, వాటర్ వర్క్స్ జీఎం సాయిలక్ష్మి, ఏజీఎం మహేష్, ప్రసాద్, జియావుద్దీన్, ఖాదర్, డిఈ వెంకటకృష్ణ, రాహుల్, డివిజన్ అధ్యక్షులు ఎన్.ధనుంజయ్, బస్తీ పెద్దలు టి.దేవదాస్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, బాస శ్రీనివాస్ నేత, గట్టయ్య, కళ్లెం లక్ష్మారెడ్డి, ఈశ్వర్ పంతులు, పెంటి అనిల్, కోట పవన్ కుమార్ నేత,యాంజల శేఖర్ నేత, ఏసు, జగదీష్, బోనకుర్తి రాము నేత, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా సహకరించాలి: మంత్రి వివేక్

● రూ.3 కోట్లతో 33 కేవీ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన ● నియోజకవర్గంలో రూ.100 కోట్లతో మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల
● మందమర్రిలో రూ.15 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

**మంచిర్యాల అక్టోబరు 7 (క్రైమ్ మిర్రర్):** ప్రజా సంక్షేమం, గ్రామాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు రాజకీయాలకు అతీతంగా సహకరించాలని పిలుపునిచ్చారు. మంచిర్యాల, మందమర్రి మండలం వెంకటాపూర్‌లో రూ.3 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న 33 కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్‌కు బుధవారం భూమిపూజ చేశారు. ఎస్‌ఈ బానోత్ రాజన్న, తహసీల్దార్ సతీష్, ఎంపీడీవో రాజేశ్వర్, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మంత్రి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భవిష్యత్తులో పెరగనున్న విద్యుత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వెంకటాపూర్ సబ్‌స్టేషన్ స్థల కేటాయింపుపై ఉన్న అభ్యంతరాలను అందరి సహకారంతో పరిష్కరిస్తామని చెప్పారు. గ్రామానికి 32 ఇందిరమ్మ ఇళ్లు, 38 సామాజిక భద్రత పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. మంజూరైన ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.





**రూ.100 కోట్లతో మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల**

రాష్ట్రంలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు 10 వేల ఉపాధ్యాయ నియామకాలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. నియోజకవర్గంలో రూ.100 కోట్ల వ్యయంతో సీబీఎస్‌ఈ, రెసిడెన్షియల్ వసతులతో 2,500 మంది విద్యార్థులకు ఆవాస పాఠశాలను అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు చెప్పారు. యువతకు ఉచితంగా జర్మన్ భాషలో శిక్షణ ఇస్తున్నామని, ప్రస్తుతం 70 మంది శిక్షణ పొందుతున్నారని తెలిపారు. మరో మూడు, నాలుగు నెలల్లో కోర్సు పూర్తిచేసుకున్న వారికి జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కాలనీ నుంచి ఆర్‌కే-5 వరకు 4.7 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రూ.4.85 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. రాత్రివేళ భద్రత కోసం దశలవారీగా హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తామన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ.10 లక్షల వరకు వైద్య సాయం అందిస్తున్నామని, అత్యవసర పరిస్థితుల్లో సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నట్లు చెప్పారు.

**రోడ్డు ప్రమాద మృతులకు నివాళి**

ఇటీవల నస్పూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వెంకటాపూర్ గ్రామస్థుల ఆత్మశాంతికి మంత్రి, అధికారులు, గ్రామస్థులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**మందమర్రిలో రూ.15 కోట్ల పనులకు శ్రీకారం**

అనంతరం మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో యూఐడీఎఫ్ నిధులు రూ.15 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. త్వరలోనే పట్టణంలో మరో రూ.40 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయని మంత్రి తెలిపారు. అమృత్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ మంచినీటి నల్లా, మురుగు కాలువల నిర్మాణం చేపట్టి మందమర్రిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో , వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని ప్రణాళికాబద్ధంగా చదవాలి... జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

ప్రతి అంశాన్ని అర్థం చేసుకొని చదివితేనే ఉన్నత లక్ష్యాలను సాధించగలరు.. ప్రథమ సంవత్సరం బైపీసీ విద్యార్థులకు కలెక్టర్ టీచర్లాగా మార్గదర్శనం

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** పరీక్షల్లో మార్కులు సాధించడం మాత్రమే లక్ష్యంగా కాకుండా, చదివే ప్రతి అంశాన్ని అర్థం చేసుకొని జ్ఞానాన్ని పెంచుకొని, స్పష్టమైన లక్ష్యం, క్రమశిక్షణతో కూడిన చదువు, నిరంతర సాధనతో ప్రతి విద్యార్థి తన కలలను సాకారం చేసుకోవచ్చు అని కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. సింగరేణి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, జూనియర్ కళాశాలలను జిల్లా కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యాలయంలో కొనసాగుతున్న అదనపు నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించి, పనుల పురోగతిపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్, పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యాలయ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం తొలగించి విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని సూచించారు. అనంతరం కలెక్టర్ తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. వారి చదువు, విద్యా ప్రగతి, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలు, వసతి, భోజనం తదితర అంశాలపై ఆరా తీశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకొని, ఏవైనా సమస్యలు ఉంటే ఉపాధ్యాయులు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం బైపీసీ విద్యార్థులతో కలెక్టర్ ప్రత్యేకంగా మాట్లాడారు. విద్యార్థుల ఇంగ్లీష్ పాఠ్యపుస్తకంలోని అభ్యాసన సామర్థ్యాన్ని పరిశీలించి, పాఠ్యాంశాలను కేవలం పరీక్షల కోసమే కాకుండా ప్రతి పదం, ప్రతి అంశాన్ని అర్థం చేసుకొని చదవాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, విద్యార్థులు తమ భవిష్యత్ లక్ష్యాలను ఇప్పటి నుంచే నిర్దేశించుకొని, అందుకు అనుగుణంగా చదువుకు ప్రణాళిక రూపొందించుకోవాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా బైపీసీ విద్యార్థులు వైద్య విద్యను లక్ష్యంగా పెట్టుకున్నట్లయితే నీట్ పరీక్షకు ఇప్పటి నుంచే పద్ధతిగా సన్నద్ధం కావాలని తెలిపారు. పరీక్షలో ఎన్ని సబ్జెక్టులు ఉంటాయి, ఏయే అంశాలకు ఎంత ప్రాధాన్యత ఉంటుంది, ఎన్ని మార్కులు సాధించాల్సి ఉంటుంది వంటి విషయాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. వైద్య విద్యతో పాటు ఫార్మసీ, ఇతర ఆరోగ్య రంగాలకు సంబంధించిన కోర్సులు, కెరీర్ అవకాశాలపై కూడా విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఒక లక్ష్యం సాధ్యం కాకపోతే తదుపరి ప్రత్యామ్నాయ లక్ష్యం ఏమిటనే దానిపై కూడా ముందుగానే స్పష్టత కలిగి ఉండాలని సూచించారు. మొదట్లో చదివిన విషయాన్ని అర్థం చేసుకోవడంలో లేదా ఇతరులకు వివరించడంలో కొంత ఇబ్బంది ఉన్నప్పటికీ, నిరంతర సాధనతో కొన్ని నెలల్లోనే ఆ సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. ఏదైనా అంశం అర్థం కాకపోతే ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని, అవసరమైతే అందుబాటులో ఉన్న ఇంటర్నెట్, డిజిటల్ వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అయితే ఇంటర్నెట్‌ను కేవలం వినోదం కోసం కాకుండా విద్యాభ్యాసానికి ఉపయోగించుకోవాలని అన్నారు. విద్యార్థులు సమూహాలుగా కలిసి చదువుకోవాలని, ఒకరికి తెలిసిన విషయాన్ని మరొకరికి వివరించాలని కలెక్టర్ సూచించారు. ఇతరులకు ఒక అంశాన్ని బోధించే ప్రయత్నం చేసినప్పుడు ఆ అంశంపై తమకున్న అవగాహన కూడా మరింత బలపడుతుందని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న ఉచిత విద్య, వసతి, భోజనం, డిజిటల్ సదుపాయాలు, ఇంటర్నెట్ తదితర అవకాశాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట మండల ప్రత్యేక అధికారి ఆలేటి ప్రమీల, తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో బానోతు పద్మ, సీడీపీవో కె.ఉమా, మండల విద్యాశాఖ అధికారి జయరాజు, నీటిపారుదల శాఖ డీఈ డి. వెంకట్ నాయక్, ఎంపీవో రాజేంద్రప్రసాద్‌తో పాటు వివిధ శాఖల అధికారులు ఉన్నారు.



# రాహుల్ గాంధీ పోరాటానికి మద్దతుగా సంగారెడ్డిలో జగ్గారెడ్డి, నిర్మల దీక్ష

## జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్

## ఓటు హక్కు పరిరక్షణ కోసమే రాహుల్ గాంధీ పోరాటం: జగ్గారెడ్డి

సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 07: దేశ ప్రజల ఓటు హక్కు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఆయన సతీమణి నిర్మల జగ్గారెడ్డి దీక్ష చేపట్టారు. సంగారెడ్డి ఓల్డ్ బస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం రాత్రి 10 గంటలకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి సంఘీభావ దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ వ్యవహారశైలిపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల వ్యవస్థను బీజేపీకి అనుకూలంగా మార్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ తీరుపై రాహుల్ గాంధీ అనేక సందర్భాల్లో ప్రశ్నలు లేవనెత్తారని తెలిపారు. "ఇది కాంగ్రెస్ పార్టీ రాజకీయ పోరాటం మాత్రమే కాదు.. దేశ ప్రజల ఓటు హక్కును కాపాడే పోరాటం. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ పోరాడుతున్నారు" అని జగ్గారెడ్డి అన్నారు. సర్ ప్రక్రియలోనూ ఎన్నికల కమిషన్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించిన ఆయన, ఓటర్ల జాబితాలకు సంబంధించి తలెత్తుతున్న వివాదాలపై ఎన్నికల కమిషన్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కోరుతూ రాహుల్ గాంధీ చేస్తున్న ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. "రాహుల్ గాంధీ పోరాటం కొనసాగినన్ని రోజులు సంగారెడ్డిలో మా దీక్ష కూడా కొనసాగుతుంది. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌కు మద్దతుగా మా పోరాటం కొనసాగిస్తాం" అని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు ప్రతిపక్ష నాయకులను పోలీసులు అడ్డుకోవడం, అదుపులోకి తీసుకోవడాన్ని ఆయన ఖండించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను పరిరక్షించడంలో నెహ్రూ, గాంధీ కుటుంబం చేసిన త్యాగాలను జగ్గారెడ్డి గుర్తుచేశారు. దీక్షలో నిర్మల జగ్గారెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని రాహుల్ గాంధీ ఉద్యమానికి సంఘీభావం తెలిపారు.




# ప్రయాణ్ క్యాపిటల్ ప్రైవేట్ లిమిటెడ్ మూడు ర్యాంకులు దేవరకొండ కే....

అద్భుతమైన పర్ఫామెన్స్ తో దూసుకెళ్తున్న బ్రాంచ్ మేనేజర్ కుంభం ఆంజనేయులు...



**దేవరకొండ టౌన్ అక్టోబర్ 07 క్రైమ్ మిర్రర్ ప్రతినిధి:** ప్రయాణ్ క్యాపిటల్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ కంపెనీ ఇల్లు లోన్స్ ఇవ్వబడును. ఈ కంపెనీలో మొదటి సరిగా 3 నెలలు పెర్ఫామేన్స్ ఆధారంగా జులై, ఆగష్టు,సెప్టెంబర్ ప్రకారం కంపెనీలోనే 1ర్ కాన్ఫరెన్స్ చెన్నై లో అక్టోబర్ 10 నా జరుపనున్నారు. ఈ మూడు నెలల పెర్ఫమేన్స్ ఆధారంగా కంపెనీ ర్యాంక్ లు ఇవ్వడం జరిగింది. ఈ ర్యాంకు లలో దేవరకొండ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ కుంభం ఆంజనేయులు కంపెనీలోనే ప్రయాణ్ క్యాపిటల్ లో 1ర్ ర్యాంక్, మరియు బ్రాంచ్ పెట్టిన మొదటి నెలలోనే 1 కోటి రూపాయల పైన బిజినెస్ చేసి 1 ఎతీ క్లబ్ లో కూడ ఇండియా లెవల్ 1 ర్ ర్యాంక్ సాధించారు. మరియు తెలంగాణలో కూడ తానే 1ర్ ర్యాంక్ సాధించారు. టోటల్ గా 3ర్యాంకులు దేవరకొండ బ్రాంచ్ మొదటి స్థానంలో నిలబడింది. త్వరలో ఈ నెల అక్టోబర్ 10 న చెన్నై లో దీనికి సంభందించిన సమావేశం జరుగనుందని తెలియజేశారు.

# విద్యుత్ కోతలపై రైతుల ఆగ్రహం..

## కోదాడ సబ్‌స్టేషన్ ఎదుట అఖిలపక్ష రైతు సంఘాల ధర్నా

**అక్టోబర్ 07 క్రైమ్ మిర్రర్:** కోదాడ: విద్యుత్ కోతల కారణంగా వరి పంటలు ఎండిపోతున్నాయని ఆరోపిస్తూ అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో రైతులు కోదాడ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. పంటలు కీలక దశలో ఉన్న సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ.. వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కోతల కారణంగా పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.




విద్యుత్ సరఫరాలో కోతలు విధించడం వల్ల బోర్లు, వ్యవసాయ మోటార్లు పనిచేయక వరి పొలాలకు సాగునీరు అందడం లేదని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గంలో రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నప్పుడు కోదాడ ప్రాంత రైతుల పట్ల పక్షపాతం ఎందుకు చూపుతున్నారని ప్రభుత్వాన్ని రైతులు ప్రశ్నించారు. తమకు కూడా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేసి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. ధర్నా సందర్భంగా రైతులు ట్రాక్టర్లను సబ్‌స్టేషన్ వద్దకు తీసుకొచ్చి ప్రధాన మార్గంలో నిలిపి నిరసన తెలిపారు. ఉద్యోగులు సబ్‌స్టేషన్‌లోకి వెళ్లకుండా ట్రాక్టర్లను అడ్డుపెట్టి తమ నిరసనను వ్యక్తం చేశారు. విద్యుత్ కోతల సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని రైతు సంఘాల నాయకులు హెచ్చరించారు.

# ఇంటి ఆవరణలో గంజాయి సాగు: ఒకరి అరెస్టు




**చెన్నూర్ అక్టోబర్ 7 (క్రైమ్ మిర్రర్):** ఇంటి ఆవరణలో అక్రమంగా గంజాయి మొక్కలు పెంచుతున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసి, ఆ మొక్కలను స్వాధీనం చేసుకున్నట్లు కోటపల్లి ఎస్ఐ శివనీతి రాజశేఖర్ తెలిపారు. మండల పరిధిలోని ఎదుల్లబందం గ్రామంలో బుధవారం ఈ దాడులు నిర్వహించారు. రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్/నార్కోటిక్స్ ఏసీపీ శ్రీనివాసరావు, చెన్నూర్ రూరల్ సీఐ కృష్ణ పర్యవేక్షణలో కోటపల్లి ఎస్ఐ రాజశేఖర్, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ జె.లక్ష్మణరావు తమ సిబ్బందితో కలిసి నమ్మదగిన సమాచారం మేరకు తనిఖీలు చేపట్టారు. గ్రామానికి చెందిన దుర్గం మహేష్ (33) తన ఇంటి ఆవరణలో అక్రమంగా పెంచుతున్న మూడు గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని, అతడిని అదుపులోకి తీసుకున్నారు. వ్యవసాయ శాఖ ఏఈఓ ఈ మొక్కలను పరిశీలించి గంజాయిగా నిర్ధారించారు. స్వాధీనం చేసుకున్న వాటిలో రెండు మొక్కలు 12 అంగుళాలు, ఒక మొక్క 14 అంగుళాల ఎత్తు ఉన్నాయని, వీటి విలువ సుమారు ?4,600 ఉంటుందని ఎస్ఐ పేర్కొన్నారు. గంజాయి సాగు, రవాణా,విక్రయాలు లేదా వినియోగానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాదకద్రవ్యాల సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలపాలని కోరారు.

# మంచిర్యాల కాంగ్రెస్‌లో రాజుకున్న వర్గపోరు!

### ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, మేయర్ ధరణి మధులకు రాజీనామా సవాళ్లు

### 'నమ్ముకున్న కార్యకర్తలకు అవమానాలు.. దొరతనం చెల్లదు'

### రూ.కోట్ల అవినీతి, బీ-ఫారమ్‌ల కేటాయింపులపై ఆధారాలు బయటపెడతాం: రావుల ఉప్పలయ్య, వేములపల్లి సంజీవ్



**మంచిర్యాల, అక్టోబర్ 7 (క్రైమ్ మిర్రర్) :** మంచిర్యాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు బహిర్గతమైంది. స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, మున్సిపల్ మేయర్ ధరణి మధు తీరుపై సొంత పార్టీకి చెందిన సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దమ్ముంటే పదవులకు రాజీనామా చేసి ప్రజాక్షేత్రంలో తిరిగి పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. బుధవారం కాంగ్రెస్ నాయకుడు మంతన జగన్మోహన్‌రావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ రావుల ఉప్పలయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేములపల్లి సంజీవ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే, మేయర్ వ్యవహారశైలిపై తీవ్ర ఆరోపణలు చేశారు.

**కార్యకర్తల శ్రమను చులకన చేయడం సరికాదు: రావుల ఉప్పలయ్య**

ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అహంకార వైఖరి వల్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా నష్టపోతోందని రావుల ఉప్పలయ్య ఆరోపించారు. గత మూడేళ్లుగా సొంత డబ్బులు, సమయాన్ని వెచ్చించి రాత్రింబవళ్లు కష్టపడి ఎమ్మెల్యేను గెలిపించిన కార్యకర్తలకు ప్రస్తుతం నిరాశ, అవమానాలే మిగిలాయని అన్నారు. ప్రజాప్రతినిధిగా ఉంటూ కార్యకర్తలను గంటల తరబడి బయట వేచి ఉండేలా చేయడం దొరతనాన్ని తలపిస్తోందని విమర్శించారు. "నేను, నా భార్య తిరిగితేనే గెలిచాం.. కార్యకర్తల వల్ల కాదు" అని ఎమ్మెల్యే అనడం పార్టీ శ్రేణుల శ్రమను అవమానించడమేనన్నారు. ఎమ్మెల్యేకు అంత ధైర్యం ఉంటే పదవికి రాజీనామా చేసి మళ్లీ పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో కాక వెంకటస్వామి కుటుంబానికి సుదీర్ఘ రాజకీయ చరిత్ర ఉందని, వివేక్ వెంకటస్వామి, వంశీకృష్ణ, జగన్మోహన్‌రావులపై విమర్శలు చేయడం సరికాదన్నారు. సొంత పార్టీ ఎంపీ, ఇతర ముఖ్య నాయకులు నియోజకవర్గానికి వచ్చినప్పుడు ఫ్లెక్సీలు చింపించడం, ఇక్కడికి రావద్దని ఆదేశాలు జారీ చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు. అభివృద్ధి పేరుతో జరుగుతున్న అవినీతి, ఎన్నికల సమయంలో బీ-ఫారమ్‌ల కేటాయింపుల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న లంచాల వ్యవహారాలపై త్వరలో ఆధారాలతో సహా వివరాలను ప్రజల ముందుంచుతామని ఉప్పలయ్య తెలిపారు. నాయకుల బెదిరింపులు, కేసులకు కార్యకర్తలు భయపడాల్సిన అవసరం లేదని, వివేక్ వెంకటస్వామి, జగన్మోహన్‌రావు నేతృత్వంలో కాంగ్రెస్ శ్రేణులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు.

**అభివృద్ధి శూన్యం.. సెటిల్మెంట్లే ధ్యేయం: వేములపల్లి సంజీవ్**

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంగ్రెస్ పాలన చేపట్టి ఆరు నెలలు గడుస్తున్నా ఏ ఒక్క డివిజన్‌లోనూ చెప్పుకోదగిన అభివృద్ధి పనులు చేపట్టలేదని మాజీ కౌన్సిలర్ వేములపల్లి సంజీవ్ ఆరోపించారు. నగరంలోని వాణిజ్య భవనాలకు అధికారులతో నోటీసులు ఇప్పించి, భయభ్రాంతులకు గురిచేసి సెటిల్మెంట్లు చేసుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారాలపై విజిలెన్స్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఒక దళిత ఎంపీ ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తుంటే, కనీస విచక్షణ లేకుండా రాత్రికి రాత్రే ఫ్లెక్సీలు తొలగించి అవమానించారని ఆరోపించారు. మేయర్ తన డ్రైవర్‌తో కార్పొరేటర్లకు ఫోన్లు చేయించి పార్టీ అధికారిక కార్యక్రమాలకు వెళ్లవద్దని బెదిరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎమ్మెల్యే, మేయర్ నియంతృత్వ వైఖరి. నచ్చకే ప్రజలు ఆలోచనలో పడ్డారని సంజీవ్ అన్నారు. కార్పొరేషన్‌లోని 60 డివిజన్లలో ఎక్కడైనా మేయర్ రాజీనామా చేసి తనపై పోటీకి సిద్ధపడాలని సవాల్ విసిరారు. లేదంటే ఎమ్మెల్యే తన కార్పొరేటర్లతో రాజీనామా చేయించి ప్రజాక్షేత్రంలోకి రావాలని డిమాండ్ చేశారు.



## అప్రమత్తమైన సింగరేణి ఎస్ అండ్ పిసి సెక్యూరిటీ సిబ్బంది స్వాధీనం చేసుకున్న విద్యుత్ మోటార్లు

### అభినందించిన ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ

**మందమర్రి టౌన్ అక్టోబర్ 07 క్రైమ్ మిర్రర్:** సింగరేణి సంస్థకు చెందిన విద్యుత్ మోటార్లను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని మొబైల్ రవాణా దళం (ఎంటీఎఫ్) సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి అడ్డుకున్నారు. మోటార్లను, వాహనాన్ని స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. మందమర్రి ఏరియాలోని మంజునాథ ఫంక్షన్ హాల్ ఎదురుగా ఉన్న సౌర విద్యుత్ కేంద్రం సమీపంలో బుధవారం తెల్లవారుజామున సుమారు 5 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. విధుల్లో ఉన్న ఎంటీఎఫ్ సిబ్బంది అనుమానాస్పదంగా కనిపించిన ఓ వ్యాన్‌ను తనిఖీ చేయగా, అందులో సింగరేణికి చెందిన రెండు విద్యుత్ మోటార్లు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే వాటిని,వ్యాన్‌ను స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తులను భద్రతా కార్యాలయానికి తరలించారు. సంస్థ ఆస్తుల పరిరక్షణలో అప్రమత్తంగా వ్యవహరించిన భద్రతా సిబ్బందిని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ అభినందించారు. సకాలంలో స్పందించి సంస్థకు నష్టం వాటిల్లకుండా అడ్డుకున్న సిబ్బందిని శాలువాతో సన్మానించి,జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఆస్తులను కాపాడటం ప్రతి ఉద్యోగి బాధ్యత అన్నారు. భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సంస్థ ఆస్తుల పరిరక్షణకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి చోరీలను అరికట్టేందుకు సహకరించాలని సూచించారు. సంస్థ పురోగతితోనే కార్మికులు, ఉద్యోగుల సంక్షేమం మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీఎంకు ప్రత్యేక అధికారి జి.ఎల్. ప్రసాద్, డీజీఎం పర్సనల్ సిహెచ్. అశోక్,ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ కె.వెంకటేశ్వర్‌రెడ్డి, జూనియర్ ఇన్స్పెక్టర్ ఓదెలు, దాస్, ఐడి పార్టీ శ్రీనివాస్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## మునుగోడు ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలి

### హామీలు కాదు -- గడువుతో కూడిన అభివృద్ధి పనులు కావాలి

### తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, సాగునీరు, రైతులు, ఉపాధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



**మునుగోడు క్రైమ్ మిర్రర్, (అక్టోబర్ 7) :** మునుగోడు నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు తక్షణమే పరిష్కరించాలని భారత చైతన్య యువజన పార్టీ తెలంగాణ పిఏసి సభ్యులు, భారత మానవ హక్కుల పరిరక్షణ మండలి -- తెలంగాణ రాష్ట్ర వైస్ చైర్మన్ డా. చిలకల శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. ప్రజలకు ప్రతిరోజూ అవసరమైన తాగునీరు, మంచి రహదారులు, డ్రైనేజీ, పారిశుధ్యం, సాగునీరు, విద్య, వైద్యం, ఉపాధి వంటి మౌలిక సదుపాయాలు సక్రమంగా అందేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కోరారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో తాగునీటి సరఫరాను అధికారులు సమీక్షించాలని కోరారు. మురుగునీరు రోడ్లపై నిలిచే ప్రాంతాలను గుర్తించి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలన్నారు. మునుగోడు నియోజకవర్గంలోని దెబ్బతిన్న రోడ్లను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. మునుగోడు ప్రాంత రైతులకు సాగునీరు అందేలా పెండింగ్‌లో ఉన్న సాగునీటి పనులను వేగవంతం చేయాలన్నారు. మునుగోడు నియోజకవర్గ యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన వైద్య సిబ్బంది, మందులు, పరీక్షా సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రతి మండలంలో ప్రజా సమస్యల జాబితాను తయారు చేసి, అత్యవసర సమస్యలకు తక్షణ పరిష్కారం,దీర్ఘకాలిక సమస్యలకు గడువుతో కూడిన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారం కోసం నిరంతరం ప్రజలతో కలిసి పనిచేస్తానని తెలిపారు.

## టీటీడీ ఆధ్వర్యంలో జరగనున్న మహోన్నత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు

### ఖమ్మం డీసీసీ అధికార ప్రతినిధి ఏలూరి శ్రీనివాసరావు



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఈ నెల 12వ తేదీన తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో జరగనున్న మహోన్నతమైన కార్యక్రమం మన ఖమ్మం నగరంలో జరగడం ఎంతో సంతోషకరమైన విషయమని ఖమ్మం జిల్లా డీసీసీ అధికార ప్రతినిధి ఏలూరి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఖమ్మంలో ఏలూరి శ్రీనివాసరావు నివాసంలో 2వ డివిజన్ నుంచి 9వ డివిజన్ వరకు వివిధ పార్టీల నాయకులు, డివిజన్ అధ్యక్షులు, ప్రముఖులతో కలిసి ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గౌరవ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక కృషి, చొరవతో టీటీడీ ఆధ్వర్యంలో ఇలాంటి ప్రతిష్టాత్మక కార్యక్రమం ఖమ్మంలో నిర్వహించబడటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమం భక్తులకు ఆధ్యాత్మికంగా ఎంతో ఉపయోగకరంగా ఉండటమే కాకుండా ఖమ్మం నగరానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురానుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న నాయకులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కి ప్రత్యేక కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పల్లెబోయిన భారతి చంద్రయ్య, తమ్మినేని వెంకటేశ్వరరావు, పగిడిముక్కుల విజయ్ కుమార్ (×బీఖజ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి), బంధు వెంకన్న, చంద్రశశి, లకావత్ సైదులు, మాగం రజిని, మల్లీ మనీషి, ఎస్.కె. యాసిన్, ఎస్.కె. హుస్సేన్, ఎడ్ల చంద్రశేఖర్, తాళ్లూరి వెంకటేశ్వరరావు, కొట్టే సుధాకర్, నెల్లూరి నాగేశ్వరరావు, నున్న కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**క్రైమ్ మిర్రర్,మంగపేట:** సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఏటూరునాగారం ఏఎస్పీ మనన్ బట్ అన్నారు. బుధవారం మండలం కమలాపురంలోని ఆదర్శ పాఠశాలలో మంగపేట ఎస్సై టీవీఆర్ సూరి ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏటూరునాగారం ఏఎస్పీ మనన్ బట్ సైబర్ నేరాల వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. తెలియని యాప్‌లను ఉపయోగించడం వల్ల జరిగే నష్టాలు, ఓటీపీ మోసాలు, గుర్తుతెలియని లింక్‌లను తెరవడం వల్ల ఎదురయ్యే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తుల నుంచి వచ్చే సందేశాలు, లింక్‌ల విషయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వ్యక్తిగత వివరాలు, ఓటీపీ వంటి సమాచారాన్ని ఇతరులకు వెల్లడించకూడదని తెలిపారు. కార్యక్రమంలో మంగపేట ఎస్సై టీవీఆర్ సూరి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ వి. ప్రసాద్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి వివేక్ వెంకటస్వామి



**మందమరి టౌన్ అక్టోబర్ 07 క్రైమ్ మిర్రర్:** మందమర్రి మున్సిపాల్టీ లో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి. మందమర్రి మున్సిపాల్టీ ఫరిధిలోని పలు వార్డులలో బుధవారం అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించగా ముఖ్య అతిధిగా విచ్చేసిన మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డుల లో యు ఐ డి ఎఫ్ నిధులతో మంజూరైన సి సి రోడ్లు డ్రైనేజి పనులకు శంకుస్థాపన చేశారు. 14వ వార్డులో 35.10 లక్షలతో సి సి రోడ్లు డ్రైనేజీ పనులను ప్రారంభించారు. అలాగే 3వ వార్డులో 75.50 లక్షలు,20వ వార్డు రామన్ కాలనీలో 53.60 లక్షలు,2వ వార్డులో ఒక కోటి 3 లక్షల 70 వేలతో సి సి రోడ్లు, డ్రైనేజి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ ప్రాంతం లో ఇటీవల చేపట్టిన సుమారు 14 కోట్ల అభివృద్ధి పనులకు గాను శిలాఫలకాన్ని ప్రారంభించారు. అనంతరం మంత్రి వివేక్ మాట్లాడుతూ గత కొన్ని ఏళ్లుగా పలు వార్డులలో రోడ్డు సౌకర్యం, డ్రైనేజి లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని అన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమం అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షునిగా మేకల రమేష్ ముదిరాజు



**క్రైమ్ మిర్రర్, నాంపల్లి:** నాంపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న: కైలాష్ నేత బుధవారం మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా మేకల రమేష్ ముదిరాజు ప్రకటించారు. అనంతరం నూతన మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా ఎన్నికైన మేకల రమేష్ ముదిరాజు మాట్లాడుతూ మాపై ఎంతో నమ్మకంతో మండల కాంగ్రెస్ పార్టీ నాంపల్లి మండల ఉపాధ్యక్షుడు ఎంపిక చేసిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కత్తి రవీందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పూల వెంకటయ్య, ఎరెడ్ల రఘుపతి రెడ్డికి సీనియర్ జిల్లా నాయకులకు, మండల నాయకులకు నాయకులకు కార్యకర్తలకు అభిమానులకు ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గ్రామస్థాయి నుండి బలోపేతం చేస్తామని తెలిపారు.

# కాంగ్రెస్ బలోపేతానికి క్షేత్రస్థాయిలో కమిటీలు

**శాంతిగూడెంలో గ్రామ, యూత్ కాంగ్రెస్, బూత్ కమిటీల ఎన్నిక**

**నూతన కమిటీ సభ్యులను సన్మానించిన ఎమ్మెల్యే బాలు నాయక్**

**పార్టీ బలోపేతానికి సమష్టిగా పనిచేయాలి: ఎమ్మెల్యే బాలు నాయక్**



**దేవరకొండ టౌన్ అక్టోబర్ 07 క్రైమ్ మిర్రర్ ప్రతినిధి:** కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసేందుకు గ్రామస్థాయిలో పార్టీ కమిటీలను పటిష్టంగా ఏర్పాటు చేస్తున్నామని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు, డిండి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు ముత్యాల శశిధర్ రెడ్డి సూచనలతో, గ్రామ సర్పంచ్ చింతలపూడి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో డిండి మండలం శాంతిగూడెంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ, యూత్ కాంగ్రెస్, బూత్ కమిటీల ఎన్నికలు నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను ఎమ్మెల్యే బాలు నాయక్ శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి అభినందించారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు.

**గ్రామస్థాయిలో పార్టీకి బలమైన పునాది**

కాంగ్రెస్ పార్టీకి గ్రామస్థాయి కార్యకర్తలే వెన్నెముక అని ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య కార్యకర్తలు వారధిగా పనిచేయాలని సూచించారు. గ్రామాల్లో ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. యువతను పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేస్తూ, యువ కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రతి బూత్‌లో పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తే కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.

**నూతన కమిటీలకు అభినందనలు**

శాంతిగూడెం గ్రామ కాంగ్రెస్ కమిటీ గౌరవ అధ్యక్షులుగా తేల్లూరి వెంకటేశ్వర రెడ్డి అధ్యక్షులుగా గణితి వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీగా ఏ. విజయా రెడ్డి, ఉపాధ్యక్షులుగా అనంతయ్య ప్లస్ బి, లాలు, కోశాధికారిగా గాదె పోల్ రెడ్డి, సెక్రటరీగా తేలూరి శేఖర్ రెడ్డి, సహాయ సెక్రటరీగా జున్ను వెంకటేశ్వర రెడ్డి ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా కొవ్వూరి కోటయ్య, కోల నరసయ్య, ఏ. విజయ రెడ్డి, గణితి శ్రీనివాసులు, కే. నారాయణ రెడ్డి ఎన్నికయ్యారు.

**యూత్ కాంగ్రెస్ గ్రామ శాఖ**

యూత్ గ్రామ శాఖ గౌరవ అధ్యక్షులుగా కొట్టే చంద్రయ్య, అధ్యక్షులుగా కొట్టే మణికంఠ, ఉపాధ్యక్షులుగా సిహెచ్. హరీష్ రెడ్డి, సహాయ కార్యదర్శిగా ఎరుకల రామకృష్ణ, కార్యదర్శిగా జిన్నశివకోటి రెడ్డి కోశాధికారిగా ఎరుకల మధు ఎన్నికయ్యారు. యూత్ కార్యవర్గ సభ్యులుగా గుంటక చరణ్ కుమార్ రెడ్డి, కొట్టె అనిల్, అనిశెట్టి కొండల్ ఎన్నికయ్యారు.

**శాంతిగూడెం గ్రామ బూత్ కమిటీసభ్యులు...**

బూత్ కమిటీ సభ్యులుగా కోలా పిచ్చయ్య, సిహెచ్. మల్లారెడ్డి, జె. శేఖర్ రెడ్డి, కొట్టే నాగేశ్వరరావు, కొవ్వూరి కొండల్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులందరినీ ఎమ్మెల్యే బాలు నాయక్ అభినందిస్తూ, పార్టీ నాయకత్వం అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వహించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, గ్రామంలోని ప్రతి కుటుంబంతో అనుసంధానమై ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చింతలపూడి భాస్కర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, నూతనంగా ఎన్నికైన గ్రామ కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, బూత్ కమిటీ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# మాదాపూర్ పోలీసుల చొరవ.. 48 మొబైల్ ఫోన్లు రికవరీ....





**క్రైమ్ మిర్రర్ మాదాపూర్:** పోగొట్టుకున్న, చోరీకి గురైన 48 మొబైల్ ఫోన్లను మాదాపూర్ పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం, సీఈఐఆర్ (జజు×= )పోర్టల్ సహాయంతో ట్రేస్ చేసి రికవరీ చేశారు. రికవరీ చేసిన మొబైల్ ఫోన్లను కూకట్‌పల్లి జోన్ అడిషనల్ డీసీపీ సుదర్శన్, మాదాపూర్ ఏసీపీ సీహెచ్. శ్రీధర్, మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ కె.వి. సుబ్బారావు, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ పి. రమేష్ తదితర పోలీస్ సిబ్బంది చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. మొబైల్ ఫోన్లు తిరిగి లభించడంతో బాధితులు మాదాపూర్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వెంటనే ఆలస్యం చేయకుండా సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు సీఈఐఆర్ (CEIR) పోర్టల్‌లో మొబైల్ వివరాలు నమోదు చేయాలని అధికారులు సూచించారు. మొబైల్ పోయిన వెంటనే దాని (IMEI)నంబర్, మొబైల్ నంబర్, బిల్లు లేదా ఇతర ఆధారాలు సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. అలాగే బ్యాంకింగ్, యు పీ ఐ , సోషల్ మీడియా వంటి ఖాతాలు మొబైల్‌కు అనుసంధానమై ఉంటే వెంటనే పాస్‌వర్డ్‌లు మార్చుకుని, అవసరమైతే సంబంధిత బ్యాంకులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి మొబైల్ ఫోన్లను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని పోలీసులు కోరారు.

# ప్రభుత్వ భూమిలో విద్యుత్ పనులు ఆపాలి

**క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపురం:-** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల మహమ్మదాబాద్ గ్రామ రెవెన్యూ పరిధిలో 239 సర్వేనెంబర్ గల ప్రభుత్వ భూమిలో విద్యుత్ మరమతులను ఆపాలని మహమ్మదాబాద్ గ్రామ ప్రజలు ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ భూమిలో ప్రైవేటు వ్యక్తులకు ట్రాన్స్ఫార్మర్ నిర్మాణాన్ని నిలిపివేసి గ్రామానికి సంబంధించిన దేవర గుట్ట (మల్లన్న దేవుని గుట్ట) సమీపంలో ఉన్న భూములను కాపాడాలని యాదవ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో రెవిన్యూ అధికారులకు ఇదే విషయంపై తెలుపగా గతంలో హెచ్చరిక బోర్డులను నాటించి ప్రభుత్వ భూమిలోకి ఎవరు ప్రవేశించవద్దని హెచ్చరించినారు. ఆంధ్ర ప్రదేశ్ శ్రీకాకుళం వాస్తవ్యులు పచ్చిగోళ్ళ రాజకుమార్ సాయి గారితో విద్యుత్ డీడీలు తీయించి అక్రమంగా ప్రభుత్వ భూమిలో విద్యుత్ మరమ్మత్తులు చేపడుతున్నారు. గతంలో గ్రామస్తులు అడ్డుకోగా గ్రామ సర్పంచ్ ముత్యాల అంజయ్య, మరి కొంతమంది గ్రామస్తులపై దాడి చేసి స్థానిక పోలీస్ స్టేషన్లో కూడా కేసు పెట్టినారు. ఇదే విషయంపై శాసనమండలి సభ్యుడు నెల్లికంటి సత్యం ఓ కార్యక్రమానికి హాజరైన ఆయనకు తెలుపగా వెంటనే విద్యుత్ సంబంధిత ఏ సి, ఏ డి, డి ఈ లతో చరవాణి ద్వారా మాట్లాడారు. యాదవ కులదైవమైన మల్లన్న దేవర గుట్ట సమీపంలో ఉన్న భూమిలో ఎటువంటి విద్యుత్ మరమ్మతులు చేపట్టవద్దని అధికారులను ఆదేశించారు. ప్రజా అవసరాల కోసం ఏదైనా ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుడితే అభ్యంతరాలు ఏముండవని తెలిపారు. ప్రైవేటు వ్యక్తులకు వారి సొంత భూములు విద్యుత్ మరమ్మతులు చేయించుకోకుండా దేవాలయం భూముల్లో నిర్మాణాలు చేపట్టవద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ముత్యాల అంజయ్య, వార్డు సభ్యులు దంటిక అశోక్, యాదవ సంఘం నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వచ్చే ఏడు నెలలు నీటిని పొదుపుగా వాడాలి: జగ్గారెడ్డి





**సింగూరులో 29 టీఎంసీలకు బదులు 3 టీఎంసీలే ఉంది**

**తాగునీటి సరఫరాకు ముందస్తు చర్యలు తీసుకోవాలి**

**విద్యుత్ సమస్యలపై ప్రత్యేక సమీక్ష సమావేశం**

**ఇంటింటా అవగాహనతో నీటి వృథాకు అడ్డుకట్ట వేయొచ్చు**

**టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ప్రజలకు సూచన**



**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 07:** సంగారెడ్డి నియోజకవర్గంలో రానున్న ఏడు నెలలు తాగునీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ప్రజలకు సూచించారు. మళ్లీ వర్షాలు కురిసే వరకు మంజీరా, సింగూరు నీటిని తాగునీటి అవసరాల కోసం జాగ్రత్తగా వినియోగించుకోవాలని కోరారు. తాగునీరు, విద్యుత్ సమస్యలపై విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ, మున్సిపల్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. సింగూరు ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29 టీఎంసీలు కాగా ప్రస్తుతం సుమారు 3 టీఎంసీల నీరు మాత్రమే ఉందని అధికారులు వివరించారు. అందుబాటులో ఉన్న నీటిని దృష్టిలో ఉంచుకుని వినియోగాన్ని నియంత్రించాల్సిన అవసరం ఉందని జగ్గారెడ్డి పేర్కొన్నారు. డిసెంబర్ వరకు తాగునీటి సరఫరా కొనసాగించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. నీటి వృథాను అరికట్టేందుకు సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీలతో పాటు నాలుగు మండలాల గ్రామాల్లో ఇంటింటా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన సూచించారు. అవసరం లేని సమయంలో నల్లాలను మూసివేయాలని, మోటార్ల ద్వారా నీటి వృథాను నియంత్రించాలని కోరారు. నీటి పొదుపుపై మైక్‌లు, పాంప్లెట్ల ద్వారా ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. మిషన్ భగీరథ సరఫరాలో ప్రెషర్ పెంచి నీటి సరఫరాను మెరుగుపరచాలని నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పశువులకు సైతం తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సింగూరు నుంచి ఇటీవల నీటిని విడుదల చేసిన అంశంపై జగ్గారెడ్డి మాట్లాడుతూ, డ్యామ్ భద్రతకు సంబంధించి నిపుణుల సూచనల మేరకే నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో ప్రాజెక్టును కాపాడుకోవడమే లక్ష్యంగా తీసుకున్న నిర్ణయాన్ని రాజకీయం చేయడం సరికాదన్నారు. విద్యుత్ సరఫరాలో తరచూ బ్రేక్‌డౌన్లు ఏర్పడి మోటార్లు కాలిపోతున్నాయని సమావేశంలో నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి వచ్చే మంగళవారం ఉదయం 11 గంటలకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక సమీక్ష నిర్వహించనున్నట్లు జగ్గారెడ్డి తెలిపారు.



బాలాపూర్ పోలీస్ స్టేషన్కు బదిలీపై ఎస్ హెచ్ ఓ గా నాగరాజు బాధ్యతలు చేపట్టారు. అయ సదన్ పోలీస్ స్టేషన్ లో ఎస్ హెచ్ ఓ గా విధులు నిర్వహించిన నాగరాజు బదిలీ లో భాగంగా బాలాపూర్ పోలీస్ స్టేషన్ కు రావడం జరిగింది. ఇక్కడ ఎస్ హెచ్ ఓ గా విధులు నిర్వహించిన సుధాకర్ స్పెషల్ బ్రాంచ్ కు బదిలీపై వెళ్లారు.

(బాలాపూర్ క్రైమ్ మిర్రర్)

# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ



విద్యార్థులకు అవగాహన కల్పించిన ఎస్పీ పరితోష్ పంకజ్



**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 07:** సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. సైబర్ జాగృకత దివస్‌లో భాగంగా ఎం.ఎన్.ఆర్. యూనివర్సిటీ విద్యార్థులకు డిజిటల్ చెల్లింపులు, ఆన్‌లైన్ షాపింగ్, డిజిటల్ అరెస్ట్, పెట్టుబడి మోసాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో ప్రజల అవసరాలు, అత్యాశ, భయాన్ని ఆసరాగా చేసుకొని సైబర్ నేరగాళ్లు వివిధ రకాల మోసాలకు పాల్పడుతున్నారని ఎస్పీ తెలిపారు. తెలియని లింకులను క్లిక్ చేయవద్దని, ఓటిపి, పిన్, సివివి, పాస్‌వర్డ్, యుపిఐ పిన్ వంటి రహస్య సమాచారాన్ని ఎవరితోనూ పంచుకోవద్దని సూచించారు. ఆన్‌లైన్ షాపింగ్‌లో భారీ డిస్కౌంట్లు, ఆకర్షణీయమైన ఆఫర్లను నమ్మి గుర్తుతెలియని వెబ్‌సైట్లకు ముందస్తుగా నగదు చెల్లించవద్దన్నారు. తక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని చెప్పే పెట్టుబడి, ట్రేడింగ్, క్రిప్టో కరెన్సీ, షేర్ మార్కెట్ ఆఫర్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీసులు, సిబిఐ, కస్టమ్స్ అధికారుల పేరుతో ఫోన్ చేసి కేసులు, అరెస్టు పేరుతో భయపెట్టి డబ్బులు డిమాండ్ చేస్తే నమ్మవద్దని, ప్రభుత్వ సంస్థలు ఫోన్ లేదా వీడియో కాల్ ద్వారా విచారణ పేరుతో డబ్బులు అడగవని స్పష్టం చేశారు. పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, లోన్ యాప్‌లు, ఇంపర్సనేషన్ మోసాలపైనా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వడంతో పాటు ఎఎవతీఎతీఅఎవ.వ్రశీజ.అఅలో ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. సకాలంలో ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును నిలిపివేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సైబర్ సెల్ డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి, ఎం.ఎన్.ఆర్. యూనివర్సిటీ వైస్‌చాన్సులర్ కృష్ణ చలం, రిజిస్ట్రార్ రాజేశ్వరన్, ఎన్.ఆర్. క్యాంపస్ డిప్యూటీ డైరెక్టర్ గిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్ Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు




## ఆగమ్మ దశదినకర్మలో ఎమ్మెల్సీ

**క్రైమ్ మిర్రర్,సంస్థాన్ నారాయణపురం:-** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని మహమ్మదాబాద్ లో దంటిక ఆగమ్మ దశదినకర్మ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హాజరై ఆగమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, సీపీఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సీపీఐ మండల కార్యవర్గ సభ్యుడు పల్లె మల్లారెడ్డి, సర్పంచ్ ముత్యాల అంజయ్య, సిపిఐ సీనియర్ నాయకుడు ఎమ్మెల్యే గాలయ్య, ఈద మల్లయ్య, పార్టీ కార్యకర్తలు, ఆగమ్మ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# బండోనిపల్లి లే అవుట్‌లో హద్దు రాళ్ల మాయం!

**జేసీబీలతో భూమి చదును.. ప్లాట్ల కొనుగోలుదారుల్లో ఆందోళన**



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (వెల్దండ):** వెల్దండ మండలం బండోనిపల్లి పంచాయతీ అనుమతితో ఏర్పాటు చేసిన లే అవుట్‌లో హద్దు రాళ్లను తొలగించి జేసీబీలతో భూమిని చదును చేస్తున్నారంటూ గ్రామ సర్పంచ్ సంగీత శేఖర్‌రెడ్డి బుధవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. లే అవుట్‌లో జరుగుతున్న పరిణామాలపై సమగ్ర విచారణ జరిపి, ప్లాట్ల కొనుగోలుదారుల ప్రయోజనాలను కాపాడాలని అధికారులను కోరారు. మండలంలోని బండోనిపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 294, 297, 298, 299లో హైదరాబాద్‌కు చెందిన కొందరు వ్యక్తులు 2012లో గ్రామపంచాయతీ అనుమతితో లే అవుట్ ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ తెలిపారు. సుమారు 185 ప్లాట్లను విక్రయించినట్లు పేర్కొన్నారు. ప్లాట్లు కొనుగోలు చేసిన వారు అప్పుడప్పుడు తమ స్థలాలను పరిశీలించేవారని, అయితే కొంతకాలంగా ఎవరూ ప్లాట్ల వద్దకు రావడం లేదన్నారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొందరు వ్యక్తులు లే అవుట్‌లోని హద్దు రాళ్లను తొలగించి, జేసీబీల సహాయంతో భూమిని చదును చేస్తున్నట్లు సర్పంచ్ ఆరోపించారు. దీంతో ప్లాట్లను కొనుగోలు చేసిన వారిలో ఆందోళన నెలకొంది. విషయం తెలుసుకున్న గ్రామపంచాయతీ అధికారులు స్పందించి బుధవారం లే అవుట్ ప్రాంతాన్ని పరిశీలించారు. పంచాయతీ ఎంపీవో లింగయ్య లే అవుట్‌ను పరిశీలించి అక్కడి పరిస్థితులపై వివరాలు సేకరించారు.

**కొనుగోలుదారులకు అండగా ఉంటాం...**

ఈ మేరకు సర్పంచ్ సంగీత శేఖర్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శి తిరుపతమ్మ, తహసీల్దార్ కార్తీక్‌కుమార్, ఎంపీడీవో సులోచనకు ఫిర్యాదు చేశారు. పంచాయతీ అనుమతితో ఏర్పాటు చేసిన లే అవుట్‌ను నిబంధనల ప్రకారం యథాతథంగా ఉంచాలని, హద్దు రాళ్లు తొలగించి భూమిని చదును చేస్తున్న చర్యలను అడ్డుకోవాలని కోరారు. ఇప్పటికే విక్రయించిన ప్లాట్లను తిరిగి విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలపైనా సమగ్ర విచారణ చేపట్టాలని అధికారులను కోరినట్లు తెలిపారు. ప్లాట్లు కొనుగోలు చేసిన వారి ప్రయోజనాలను కాపాడేందుకు గ్రామపంచాయతీ తరఫున అండగా నిలుస్తామని సర్పంచ్ సంగీత శేఖర్‌రెడ్డి స్పష్టం చేశారు.

## ఎమ్మెల్సీ అనంతబాబుకు సుప్రీంకోర్టులో చుక్కెదురు

రాజమండ్రి: వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తన మాజీ డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. విచారణ తుది దశకు చేరుకున్న సమయంలో నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించడం సరైన పద్ధతి కాదని, ముందుగా హైకోర్టుకు వెళ్లాలని పిటిషనర్‌కు స్పష్టం చేసింది. కేసు విచారణ అత్యంత వేగంగా సాగుతోందని, మొత్తం 87 మంది సాక్షుల్లో అత్యధికుల విచారణ ఇప్పటికే పూర్తయిందని ప్రభుత్వం తరఫున వాదనలు వినిపిస్తున్న సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా తెలిపారు. ఈ దశలో బెయిల్ మంజూరు చేయడం సముచితం కాదని ఆయన తన వాదనలు వినిపించారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం, కేసులో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. విచారణ గడువును మరో ఆరు నెలలు పొడిగించాలని అనంతబాబు భార్య చేసిన అభ్యర్థనను కూడా కోర్టు తోసిపుచ్చింది. ఈ సందర్భంగా పిటిషన్‌ను వెనక్కి తీసుకుని హైకోర్టును ఆశ్రయించాలని అనంతబాబు తరఫు న్యాయవాదులకు ధర్మాసనం సూచించింది. విచారణను రోజువారీ పద్ధతిలో కొనసాగించి, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ట్రయల్ కోర్టును ఆదేశించింది.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ...

- ప్రభుత్వం రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయాలి
- అందుకు మంత్రి పొంగులేటి చొరవ తీసుకోవాలి
- వేతనాలు, హక్కులు, సంక్షేమ పథకాల అమలు కోసం జేఏసీ ఏర్పాటు
- డెస్క్ జర్నలిస్టుల సమస్యలపై యూనియన్ ప్రత్యేక దృష్టి
- కాలానికి అనుగుణంగా జర్నలిస్టులు ఏఐపై పట్టు సాధించాలి
- వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు రాణా ప్రతాప్







**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** జర్నలిస్టుల సమస్యలపై చర్చించి పరిష్కరించేందుకు అన్ని జర్నలిస్టు సంఘాలతో కలిపి హైదరాబాద్ లో ఒక రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయాలని వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు రాణా ప్రతాప్ తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. ఇందుకు రాష్ట్ర పౌర సంబంధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తక్షణమే రాష్ట్రంలోని జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారికి అవసరమైన సంక్షేమ పథకాలను అమలు చేయక పోతే, జర్నలిస్టుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. బుధవారం ఖమ్మంలోని టీటీడీసీ బిల్డింగ్ లో డబ్ల్యూజేఐ ఖమ్మం జిల్లా కన్వీనర్ గంటెల ఆనంద్ అధ్యక్షతన ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల యూనియన్ ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాణా ప్రతాప్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాబోవు రోజుల్లో జర్నలిస్టుల సమస్యలపై పోరాడేందుకు అన్ని జర్నలిస్టు సంఘాలతో కలిపి జేఏసీ ఏర్పాటు చేయబోతున్నట్లు చెప్పారు. ఇది కేవలం రాష్ట్రానికే పరిమితం కాదని, దేశవ్యాప్తంగా వివిధ జర్నలిస్టు సంఘాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి ఐక్య పోరాటాలు సాగిస్తామన్నారు. జర్నలిస్టులకు చట్ట బద్ధంగా దక్కాల్సిన వేతనాలు, సంక్షేమ పథకాలు, అక్రిడేషన్లు, హెల్త్ కార్డులు, ఇండ్ల స్థలాలు, హక్కుల సాధన కోసం డబ్ల్యూజేఐ ఆధ్వర్యంలో కూడా నిరంతర పోరాటాలు సాగిస్తామన్నారు. ఈ రంగంలో పని చేస్తున్న వేలాది మంది జర్నలిస్టులు కనీస వేతనాలు, భద్రత లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పత్రికా యాజమాన్యాలు కనీస వేతనాలు కూడా చెల్లించకుండా జర్నలిస్టులతో వెట్టి చాకిరీ చేయించుకోవడం దారుణమని, జర్నలిస్టులకు న్యాయంగా దక్కాల్సిన వేతనాలు, ఇతర సదుపాయాల కోసం యాజమాన్యాలపై రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ప్రత్యేకించి డెస్క్ జర్నలిస్టుల సమస్యలపై కూడా తమ సంఘం దృష్టి సారిస్తుందన్నారు. ప్రభుత్వ పరంగా జర్నలిస్టులకు అమలుకావాల్సిన సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయించేందుకు సంఘం కృషి చేస్తుందని పేర్కొన్నారు. జర్నలిస్టుల ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా పని చేస్తూ, దేశ వ్యాప్తంగా ఉద్యమాలు నిర్మిస్తోందని తెలిపారు. ప్రస్తుతం జర్నలిజంలో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయని, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోక పోతే జర్నలిస్టులు వెనుకబడే ప్రమాదం ఉందని రాణా ప్రతాప్ హెచ్చరించారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై ప్రతి జర్నలిస్టు అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఏఐ సాయంతో వార్తలను రూపొందించే విధానాలు, వార్తా రచనలో సాంకేతికతను వినియోగించుకునే పద్ధతులను ఆయన వివరించారు.

**సంఘాన్ని మరింత విస్తరించాలి: రాష్ట్ర కార్యదర్శి ఎన్.ఎస్ రావు**

డబ్ల్యూజేఐ రాష్ట్ర కార్యదర్శి నారా సుబ్రమణ్యేశ్వర రావు (ఎన్.ఎస్ రావు) మాట్లాడుతూ రానున్న ఒకటి, రెండు నెలల్లో యూనియన్ ను మరింత ముందుకు తీసుకుపోవాల్సిన అవసరం వుందన్నారు. అందుకు ప్రతి సభ్యుడు కృషి చేయాలని, సభ్యత్వాల నమోదును పెంచాలని కోరారు. అలాగే, ఎప్పటికప్పుడు స్థానిక జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు సాగించాలని పిలుపు నిచ్చారు. పోరాటాల ద్వారానే సంఘం బలోపేతమవుతుందని, ఆ దిశగా ప్రతి జిల్లాలో కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని సూచించారు. అనంతరం డబ్ల్యూజేఐ సభ్యులకు డిజిటల్ గుర్తింపు కార్డులను అందజేసి, సీనియర్ జర్నలిస్టులను సన్మానించారు. ఈ సమావేశంలో మహబూబాబాద్ డబ్ల్యూజేఐ జిల్లా కన్వీనర్ హెచ్. రామకృష్ణా రెడ్డి, టీజేఏ ఖమ్మం జిల్లా గౌరవ అధ్యక్షులు మణి కుమార్, డబ్ల్యూజేఐ ఖమ్మం జిల్లా కోకన్వీనర్లు ఎం.ఏ అన్సార్ పాషా, ఎన్. రామకృష్ణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోకన్వీనర్ కోలే దామోదర్, ఖమ్మం అసెంబ్లీ నియోజక వర్గ ఇంచార్జి కె. కళ్యాణ్ చక్రవర్తి, వివిధ జిల్లాల నాయకులు జాబిశెట్టి కుటుంబ రావు, గోగుల నారాయణ రావు, కట్టెకోల చిన నరసయ్య, మోదెపల్లి కిరణ్, ఏనిగండ్ల శ్రీనివాస్, నల్లా జగన్ రెడ్డి, జానీ, వేర్పుల సాగర్, పొనకంటి ఉపేందర్, బొడ్డుపల్లి రవీందర్, పసుపులేటి ఉపేందర్, వుల్లోజి హరీష్, శ్రీనివాస చారి తదితరులు పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడితే కఠిన చర్యలు

- లింగ నిర్ధారణ చేస్తే లైసెన్స్ రద్దు!
- నిబంధనలు ఉల్లంఘించే స్కానింగ్ కేంద్రాలపై కఠిన చర్యలు
- అనుమతుల రద్దుతో పాటు అవసరమైతే కేంద్రాలు సీజ్
- స్కానింగ్ కేంద్రాలపై నిరంతర నిఘా: అడిషనల్ కలెక్టర్ పాండు
- లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడితే కఠిన చర్యలు
- నిబంధనలు పాటించే స్కానింగ్ కేంద్రాలకే రిజిస్ట్రేషన్, రెన్యువల్
- నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి: అడిషనల్ కలెక్టర్ పాండు



**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి అక్టోబర్ 07:** గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలను నిషేధించే పిసిపిఎన్డీటి చట్టాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని అడిషనల్ కలెక్టర్ పాండు అధికారులను ఆదేశించారు. లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడే స్కానింగ్ కేంద్రాలపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బుధవారం అడిషనల్ కలెక్టర్ ఛాంబర్‌లో పిసిపిఎన్డీటి చట్టంపై జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రెన్యువల్, రికార్డుల నిర్వహణ, చట్టం అమలు, ప్రజల్లో అవగాహన కల్పించే అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా పాండు మాట్లాడుతూ.. అర్హతలు, అవసరమైన అనుమతులు కలిగి, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించే స్కానింగ్ కేంద్రాలకు మాత్రమే రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేయాలని సూచించారు. గర్భిణీలకు నిర్వహించే స్కానింగ్ ద్వారా పుట్టబోయే శిశువు ఆడా, మగా అనే లింగ నిర్ధారణ చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు.ఎవరైనా లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడినట్లు గుర్తిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించే స్కానింగ్ కేంద్రాల అనుమతులు రద్దు చేయడంతో పాటు అవసరమైన సందర్భాల్లో సీజ్ చేసే చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని స్కానింగ్ కేంద్రాల్లో స్కానింగ్‌కు సంబంధించిన రికార్డులు, రిపోర్టులు, రిజిస్టర్ల నిర్వహణను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి, రికార్డుల నిర్వహణలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలను ప్రోత్సహించడంతో పాటు వాటికి సహకరించే వారు కూడా చట్ట ప్రకారం శిక్షార్హులేనని తెలిపారు. పీసీపీఎన్డీటీ చట్టంలోని నిబంధనలు, లింగ నిర్ధారణ పరీక్షల వల్ల కలిగే అనర్థాలు, భ్రూణ హత్యల నివారణపై జిల్లావ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా గర్భిణీలు, వారి కుటుంబ సభ్యులు, వైద్య సిబ్బంది, స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులకు చట్టంపై అవగాహన కల్పించాలన్నారు.చట్టం సమర్థవంతమైన అమలుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అడిషనల్ కలెక్టర్ సూచించారు. సమావేశంలో కమిటీ సభ్యులు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో డిఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవి, డిసిహెచ్‌ఎస్ శ్రీధర్ కుమార్, జిల్లా స్థాయి అడ్వైజరీ కమిటీ సభ్యులు డాక్టర్ లక్ష్మీ శైలజ, డాక్టర్ శశికల, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అడ్వకేట్ శైలజ, డాక్టర్ రాజు గౌడ్, సంబంధిత వైద్యులు పాల్గొన్నారు.

## కుమార్తె పెళ్లికి సీఎం విజయ్‌ను ఆహ్వానించిన వైఎస్ షర్మిల



అమరావతి: ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. తన కుమార్తె వివాహ వేడుకకు ఆయన్ను ఆహ్వానించేందుకు షర్మిల తన భర్త అనిల్ కుమార్‌తో కలిసి నేడు చెన్నై వెళ్లారు. అక్కడ ముఖ్యమంత్రి కార్యాలయంలో సీఎం విజయ్‌ను నేరుగా కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. వచ్చే నెల 25న తన కుమార్తె వైఎస్ అంజలి రెడ్డి వివాహం జరగనున్నట్లు షర్మిల తెలిపారు. ఈ వేడుకకు కుటుంబ సమేతంగా హాజరై, నూతన వధూవరులను ఆశీర్వదించాలని సీఎం విజయ్‌ను సాదరంగా కోరారు. ఈ సమావేశం అనంతరం షర్మిల సోషల్ మీడియా వేదికగా తన సంతోషాన్ని పంచుకున్నారు. తమకు సమయం కేటాయించిన సీఎం విజయ్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఆయన చూపిన ఆప్యాయత, అనురాగం ఎంతో ఆనందాన్ని కలిగించాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాబోయే దంపతులకు సీఎం విజయ్ తన శుభాకాంక్షలు తెలియజేసినట్లు వైఎస్ షర్మిల వివరించారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.